
Follow: @ANNTELUGU
15-11-2025
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 327 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బీహార్ శాసనసభ ఎన్నికల ఫలితాలు - 2025




# బిహార్‌లో ఎన్డీయే సునామీ

## 243 స్థానాలకుగాను 203 చోట్ల జయభేరి

- బిహార్ ప్రజలు మరోసారి అభివృద్ధి నినాదానికే జై
- ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలదన్నేలా ఎన్‌డీఏ విజయం
- విపక్ష మహాగఠ్‌బంధన్ కేవలం 34 స్థానాలకే పరిమితం
- ఖాతా తెరవలేకపోయిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్
- ఐదు స్థానాల్లో గెలిచిన ఎంఐఎం.. ఒక్క స్థానం దక్కించుకున్న బహుజన్ సమాజ్ పార్టీ

**బీహార్, మహా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్‌డీఏ కూటమి అఖండ మెజార్టీతో గెలుపొందింది. మొత్తం 243 స్థానాలకుగాను 203 చోట్ల జయభేరి మోగించింది. ఆర్‌జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ కూటమికి ఓటమి తప్పలేదు. విపక్ష కూటమి 34 స్థానాలకే పరిమితమైంది. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ నెలకొల్పిన జనసూరజ్ పార్టీ కనీసం ఖాతా కూడా తెరవలేకపోయింది. మిగతా 3లో

## కాంగ్రెస్‌లో త్వరలో చీలిక

అదొక ముస్లింలీగ్ మావోయిస్ట్ కాంగ్రెస్ లా మారింది:మోదీ జోస్యం

వివరాలు 4లో

## జూబ్లీహిల్స్‌లో హస్తం ప్రభంజనం

అన్ని డివిజన్లలోనూ వార్ వన్ సైడ్

కాంగ్రెస్ దెబ్బకు.. కారు చిత్తు

24,729 ఓట్ల మెజారిటీతో నవీన్ యాదవ్ ఘనవిజయం

డిపాజిట్ గల్లంతైన బీజేపీ

రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్‌కు వరుస విజయాలు

కాంగ్రెస్ ప్రజాపాలనకు ప్రజల పట్టాభిషేక

**హైదరాబాద్ -మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం సూపర్ సక్సెస్ అయ్యారు. సీఎం దెబ్బకు, రాజకీయ చాణక్యానికి జూబ్లీహిల్స్‌లో వార్ వన్‌సైడ్ అయ్యింది. సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ చెప్పినదాని కంటే ఎక్కువ ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందారు. తన ప్రత్యర్థి.. బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు మాగంటి సునీతపై 24,729 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మొదలు.. ప్రతి దశలోనూ నవీన్ యాదవ్ లీడ్‌లో నిలుస్తూ వచ్చారు. ఏ దశలోనూ ప్రత్యర్థులు నవీన్‌ను చేరింది లేదు. ఫలితంగా 10 రౌండ్లలో 24 వేల పైచిలుకు ఓట్లతో జూబ్లీహిల్స్ గడ్డపై జయకేతనం ఎగురవేశారు. సరిగ్గా వారం రోజులు ముందు జూబ్లీహిల్స్ ఎన్నికలపై సమీక్ష నిర్వహించిన సీఎం.. తనదైన శైలిలో వ్యూహ రచన చేశారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.



# రేవంత్ ధమాకా

### జూబ్లిహిల్స్ ఉపఎన్నిక ఫలితాలు

| | | |
|---|---|---|
| కాంగ్రెస్ | 98,988 | 50.8% |
| బీఆర్ఎస్ | 74,259 | 38.1% |
| బీజేపీ | 17,061 | 8.8% |
| ఇతరులు | 3,495 | 1.8% |
| నోటా | 924 | 0.5% |



## రెండేళ్ల పాలనకు రెఫరెండమే జూబ్లీహిల్స్ ఫలితం

కిషన్ రెడ్డి పద్ధతి మార్చుకో.. కేటీఆర్ అహంకారం తగ్గించుకో

తీరు మారకపోతే బీజేపీకి భూకంపం వంటి ఫలితాలు వస్తాయి

బీఆర్ఎస్ ఓడిపోతుంది.. బీజేపీకి డిపాజిట్ రాదని ముందే చెప్పా

కేసీఆర్ ప్రస్తుతం క్రియాశీలక రాజకీయాల్లో లేరు.. ఆరోగ్యం సహకరించడం లేదు

స్థానిక ఎన్నికలపై 17న కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటాం: సీఎం రేవంత్ రెడ్డి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయంపై మంత్రులతో కలిసి మీడియా సమావేశం

02

## ప్రతీ డివిజన్ కాంగ్రెస్‌దే..

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 7 డివిజన్లు ఉండగా.. ప్రతీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీనే పైచేయి సాధించింది. ఒక్క షేక్ పేట్ డివిజన్‌లో మాత్రమే టఫ్ కాంపిటేషన్ కనిపించగా.. మిగిలిన అన్ని డివిజన్లలో ఏకపక్షంగా సాగిపోయింది. అన్ని డివిజన్ల ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారు. మొత్తం 7 డివిజన్ల ఓట్లను 10 రౌండ్లలో కౌంట్ చేశారు. ప్రతీ రౌండ్‌లోనూ కాంగ్రెస్ పార్టీకే మెజార్టీ లభించింది. ఫలితంగా 24,729 ఓట్ల భారీ మెజార్టీతో సునీతపై నవీన్ యాదవ్ గెలుపొందారు.






02

## ఓటమిని విశ్లేషించుకుంటాం

ఎంఐఎం మద్దతు, డబ్బుతోనే కాంగ్రెస్ గెలిచింది

జీహెచ్ఎంసీ మేయర్ పదవి గెలుచుకోవడమే మా లక్ష్యం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



## ఓడిపోయామని నిరాశ లేదు.. బలంగా తిరిగొస్తాం

కాంగ్రెస్‌కు మేమే ప్రత్యామ్నాయం

ఆఖరి మూడు రోజుల్లోనే అంతా మార్చారు

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ ఓటమిపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

02

## గేమ్ ఛేంజర్

ఒంటి చేత్తో.. కాంగ్రెస్‌ను గెలిపించిన సీఎం

వ్యూహాత్మక ప్రణాళికతో బీఆర్ఎస్ కు దిమ్మతిరిగే షాక్

కాంగ్రెస్ ను గెలిపించిన రేవంత్ అస్త్రాలు

02

## ఎఎన్ఎన్ - టుడే చాణక్య లెక్క పక్కా

- 51 శాతం ఓట్లు సాధించిన కాంగ్రెస్
- ప్రీపోల్, ఎగ్జిట్ పోల్ సర్వేలోనూ అదే ట్రెండ్

02

TODAY CHANAKYA



## వైభవంగా ప్రజా ప్రభుత్వ వార్షికోత్సవం

### 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025

- తెలంగాణ భవిష్యత్ కు రోడ్ మ్యాప్ రూపొందించుకోబోతున్నాం
- ఈ గ్లోబల్ సమ్మిట్ కు వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించండి
- సమ్మిట్‌పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహించబోతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ సమ్మిట్ గురించి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మిగతా 2లో

## కాంగ్రెస్‌ను చూసి బీజేపీ నేర్చుకోవాలి

### తెలంగాణ బీజేపీ పెద్ద మనుషులు మారరు

- జీహెచ్ఎంసీ, లోకల్ బాడీ ఎన్నికల పరిస్థితి ఏంటి?
- బీజేపీ నేతలపై ఎమ్మెల్యే రాజాసింగ్ హాట్ కామెంట్స్



**హైదరాబాద్, మహా:** బీజేపీ రాష్ట్ర నేతల తీరుపై ఎమ్మెల్యే రాజాసింగ్ మండిపడ్డారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ లక్ష్యంగా విమర్శనాస్త్రాలు చేశారు. బీజేపీ నేతలు కాంగ్రెస్ నేతలను చూసి నేర్చుకోవాలన్నారు. జూబ్లీహిల్స్‌లో గెలవాలని కాంగ్రెస్ నేతలు పనిచేస్తే.. బీజేపీ నేతలు ఎలా ఓడిపోవాలో పనిచేశారన్నారు. మిగతా 2లో

## మహేష్ గౌడ్ హిట్ .. రాంచందర్ రావు ఫ్లాప్

తెలంగాణ పాలిటిక్స్‌లో చీఫ్ లపై చర్చ


వివరాలు 2లో

## కర్మ హిట్స్ బ్యాక్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన ట్వీట్

బీఆర్ఎస్ ఉప ఎన్నిక ఫలితాల టార్గెట్‌గా కామెంట్

వివరాలు 2లో

# రెండేళ్ల పాలనకు రెఫరెండమే జూబ్లీహిల్స్ ఫలితం

## కిషన్ రెడ్డి పద్ధతి మార్చుకో.. కేటీఆర్ అహంకారం తగ్గించుకో

- తీరు మారకపోతే బీజేపీకి భూకంపం వంటి ఫలితాలు వస్తాయి
- బీఆర్ఎస్ ఓడిపోతుంది.. బీజేపీకి డిపాజిట్ రాదని ముందే చెప్పా
- కేసీఆర్ ప్రస్తుతం క్రియాశీలక రాజకీయాల్లో లేరు.. ఆరోగ్యం సహకరించడం లేదు
- స్థానిక ఎన్నికలపై 17న కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటాం : సీఎం రేవంత్ రెడ్డి
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయంపై మంత్రులతో కలిసి మీడియా సమావేశం



**హైదరాబాద్, మహా:** అసెంబ్లీ ఎన్నికల తర్వాత హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనను నిశితంగా పరిశీలించి తీర్పు ఇచ్చారని, జూబ్లీహిల్స్ విజయం మా బాధ్యతను మరింత పెంచిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ విజయం కాంగ్రెస్ పాలనపై ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేసిందని, తమ బాధ్యతలను పెంచిందని ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయంపై సీఎం మీడియాతో మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరడంతో ఓట్ల శాతం పెరిగిందని తెలిపారు. విజయానికి కారణమైన ప్రజలకు, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు చెప్పిన రేవంత్, గెలుపు లేదా ఓటమికి పొంగిపోకుండా, ప్రజల తరఫున నిలబడి పోరాడటమే కాంగ్రెస్ కర్తవ్యమని స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39 శాతం ఓట్లు వచ్చాయి. ఆరు నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అది 42 శాతానికి పెరిగింది. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో 51 శాతం ఓట్లు ప్రజలు ఇచ్చారని, ఇది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజల ఆశీర్వాదమని చెప్పారు. హైదరాబాద్ నుంచే రాష్ట్ర ఆదాయంలో 65 శాతం వస్తోందని, ఈ నగరానికి ప్రాధాన్యత దృష్ట్యా మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమస్యల రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఈ దిశగా పనిచేస్తామని హామీ ఇచ్చారు.

**పదవులు ఎవరికీ శాశ్వతం కావు..**

కేంద్రం నుంచి నిధులు రాకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహాయం నిరాకరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. అనేక ప్రాజెక్టులకు అనుమతులు రాకుండా అడ్డుకుంటున్నారని, మెట్రో, మూసీ ప్రక్షాళన వంటి కీలక పనులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. కిషన్ రెడ్డి ఎంపీ నియోజకవర్గంలోనే బీజేపీ ఓట్లు 65 వేల నుంచి 17 వేలకు తగ్గాయని, ఆయన వ్యవహార శైలిని ప్రజలు గమనించారని చెప్పారు. జూబ్లీహిల్స్ ఫలితాన్ని భూకంపానికి ముందు వచ్చే ప్రకంపనగా చూడాలని, తీరు మారకపోతే బీజేపీకి భూకంపం వంటి ఫలితాలు వస్తాయని హెచ్చరించారు. రాజకీయాలు మాని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రులు, ఎంపీలు కలిసి సహకరించాలని, ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చే బాధ్యత వారిపై ఉందని సూచించారు. ప్రతిపక్ష నేత కేటీఆర్‌పై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు రేవంత్. అసూయ తగ్గించుకోవాలని, అధికారం పోయినా కేటీఆర్‌లో అహంకారం, అసూయ పోలేదని విమర్శించారు. పదవులు ఎవరికీ శాశ్వతం కావని, కేటీఆర్ తన అహంకారాన్ని తగ్గించుకోవాలని సూచించారు.

**స్థానిక సంస్థల ఎన్నికలపై 17న చర్చిస్తాం..**

మనం ఇంకా చాలా ఏళ్లు రాజకీయాలు చేయాల్సి ఉందని, ఫేక్ న్యూస్ రాయించి, ఫేక్ సర్వేలు చేయించుకుని భ్రమలో బతకకూడదని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఓడిపోతుందని, బీజేపీకి డిపాజిట్ రాదని ముందే చెప్పానని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో మద్దతు ఇచ్చిన ఎంఐఎం కు ధన్యవాదాలు తెలిపారు. అసదుద్దీన్ ఒవైసీకి కాంగ్రెస్ కార్యకర్తల పక్షంగా ధన్యవాదాలు చెప్పి, పొత్తులు, మద్దతులు రాష్ట్ర పరిస్థితులను బట్టి మారుతాయని తెలిపారు. బిహార్ ఎన్నికల ఫలితాల గురించి మాట్లాడుతూ, ఇంకా సమీక్షించలేదని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ నెల 17న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో లేరని, ఆయన ఆరోగ్యం సహకరించడం లేదని, ఇప్పుడు స్పందించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వచ్చే పదేళ్ల పాటు కాంగ్రెస్ పాలిస్తుందని, మార్పు చేసి చూపిస్తామని రేవంత్ ప్రకటించారు.

# గేమ్ ఛేంజర్

## ఒంటి చేత్తో.. కాంగ్రెస్ ను గెలిపించిన సీఎం

- వ్యూహాత్మక ప్రణాళికతో బీఆర్ఎస్ కు దిమ్మతిరిగే షాక్
- కాంగ్రెస్ ను గెలిపించిన రేవంత్ అస్త్రాలు

(హైదరాబాద్ -మహా)

జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ సంచలన విజయంకాంగ్రెస్ శ్రేణుల్లో ఫుల్ జోష్ నింపింది. భారీ విజయం వెనక సీఎం రేవంత్‌రెడ్డి మాస్టర్ ప్లాన్ ఎంతో పనిచేసిందని కాంగ్రెస్ శ్రేణులు అంటున్నాయి. సీఎం ఎత్తుగడలతోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. ప్రధానంగా సీఎం సంధించిన ఆరు అస్త్రాలు కాంగ్రెస్ ఘన విజయానికి కారణమయ్యాయి. కేవలం వారంరోజుల్లోనే గ్రౌండ్ ను మార్చిన గేమ్ ఛేంజర్ గా రేవంత్ చరిత్ర లిఖించారు. ముఖ్యమంత్రి వ్యూహాత్మక వైఖరితో బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులకు 2023 ఎన్నికల కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. జూబ్లీహిల్స్ చరిత్రలోనే గతంలో ఏ అభ్యర్థికి ఇంత భారీ మెజార్టీ రాకపోగా అటు బీజేపీకి డిపాజిట్ గల్లంతైంది.

**1. మైనార్టీ మంత్ర**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో క్యాడర్ లేదన్న వాస్తవాన్ని రేవంత్ రెడ్డి ముందే గ్రహించారు. అందుకు అనుగుణంగానే పావులు కదిపారు. గతంలో పోటీ చేసిన అజారుద్దీన్‌ను పోటీకి నిలిపితే చెమటోడ్చాలన్న అంచనా వచ్చారు. అజారుద్దీన్‌ను బరిలోకి దింపితే మైనార్టీ ఓట్లు వచ్చినా బీజేపీ చీలిక తెస్తే ఇబ్బంది అవుతోందని ముందే రేవంత్ రెడ్డి గ్రహించారు. తదనుగుణంగానే అధిష్ఠానాన్ని ఒప్పించి ఆయన్ను ఎమ్మెల్సీగా నియమిస్తూ క్యాబినెట్ తీర్మానం చేశారు. కానీ గవర్నర్ ఆమోదం లభించకపోవటంతో మైనార్టీల్లో అసంతృప్తిని గ్రహించిన రేవంత్‌రెడ్డి పోలింగ్‌కు కొద్ది రోజుల ముందే అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు.

2. ఎంఐఎం మద్దతు కోరడంతో పాటు సాధించడంలో సఫలమయ్యారు. సీపీఐ, సీపీఎం, టీజేఎస్ ల మద్దతును కోరి సాధించారు. వ్యూహాత్మకంగా టీడీపీ ఓటర్ల మద్దతు కూడా పొందారు.

**3. బీసీ అభ్యర్థి.. మైనార్టీ మద్దతు**

పార్టీ అభ్యర్థిగా యువకుడు, స్థానికంగా అంగ, అర్థబలం పుష్కలంగా ఉన్న నవీన్ యాదవ్‌ను ప్రకటించేలా అధిష్ఠానాన్ని ఒప్పించి మెప్పించారు. మైనార్టీ ఓట్ల ప్రాధాన్యత, ఎంఐఎంకున్న పట్టును దృష్టిలో ఉంచుకుని నవీన్ యాదవ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభ్యర్థిగా ప్రకటించారు. నవీన్ యాదవ్ రాజకీయ జీవితం ఎంఐఎంలోనే ప్రారంభమైంది. ఇలా అభ్యర్థి ఎంపికలో జాగ్రత్తపడిన ప్రచారంలోనూ తనదైన శైలి ప్రదర్శించారు.

**4. మంత్రులు, ఎమ్మెల్యేలకు బాధ్యతలు**

పార్టీ ప్రచార బాధ్యతలను డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించి ఆయనే దగ్గరుండి సమన్వయం చేశారు. క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి శ్రేణుల్లో జోష్ నింపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేలా సీఎం చర్యలు చేపట్టారు.

**5. కార్నర్ మీటింగ్స్**

సీఎం నిర్వహించిన కార్నర్ మీటింగ్స్ విజయవంతమయ్యాయి. రెండేళ్ల పాలనతో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనులు, బీఆర్ఎస్ చేస్తున్న వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టారు. బీఆర్ఎస్, బీజేపీ రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా స్పందిచవద్దని పార్టీ నేతలకు స్పష్టమైన సూచనలు చేశారు. సోషల్ మీడియా ప్రచారాన్ని తిప్పికొట్టారు. స్వయంగా రోడ్ షోలు, ప్రెస్ మీట్లు, మీట్ ది ప్రెస్ వంటి కార్యక్రమాలను నిర్వహించి, ప్రచారాన్ని చివరి నిమిషం వరకు ఉధృతం చేశారు. సర్వేల ఆధారంగా ఎప్పటికప్పుడు వ్యూహాలను మార్చుకుంటూ, కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం ప్రచారాన్ని పరుగులు పెట్టించారు.

**6. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు హామీ**


ఇక ఈ నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఉన్న సెటిలర్స్, కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లను తమవైపు తిప్పుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రయత్నించారు. దీనిలో భాగంగా తెలుగువారి ఆరాధ్యదైవం అయిన ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు హామీ ఇవ్వడం ద్వారా వారి సెంటిమెంట్‌ను ప్రభావితం చేయాలని చూశారు. దీని ద్వారా టీడీపీ శ్రేణులు కూడా ఓ రకంగా కాంగ్రెస్ కు మద్దతు పలికారని చెప్పవచ్చు. మైత్రీవనంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు హామీతో పాటు బీఆర్ఎస్ పట్ల టీడీపీ క్యాడర్ కు ఉన్న వ్యతిరేకతను సద్వినియోగం చేసుకున్నారు.

**7. సినీ కార్మికులకు వరాలు**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం సినీ పరిశ్రమకు కేంద్రంగా ఉంది. సినీ కార్మికులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో ఇక్కడ నివసిస్తుంటారు. అందుకే సీఎం సినీ కార్మికులు, పెద్దలతో వరుస సమావేశాలు నిర్వహించారు. వారి సమస్యలపై తమకున్న శ్రద్ధను చూపించి కీలక హామీలిచ్చారు. ఈ నియోజకవర్గంలో అనేక బస్తీలు, మురికివాడలు కూడా ఉన్నాయి. గత పదేళ్లలో అభివృద్ధి జరిగితే బస్తీల్లో సమస్యలు ఎందుకు ఉంటాయని రేవంత్ రెడ్డి ఓటర్లను ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చి, బస్తీల్లోని పేద, మధ్య తరగతి ఓటర్లను ఆకర్షించారు.

**8. పోల్ మేనేజ్ మెంట్**

పోల్ మేనేజ్ మెంట్, బూత్‌ల వారీ నిర్వహణలో, ఓటర్లను బూత్ కేంద్రాలకు రప్పించి ఓట్లు వేసేలా చేసుకోవడంలో సక్సెస్ అయ్యారు. ఏ అంశంలోనూ తగ్గేదెలే అని ప్రూఫ్ చేసుకున్నారు. ఆఖరిగంట దాకా పోలింగ్ తీరును సమీక్షించారు.



# ఓడిపోయామని నిరాశ లేదు.. బలంగా తిరిగొస్తాం

## కాంగ్రెస్ కు మేమే ప్రత్యామ్నాయం

- ఆఖరి మూడురోజుల్లోనే అంతా మార్చారు
- జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ ఓటమిపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తమకు కొత్త ఉత్సాహం, బలాన్నిచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నయం బీఆర్ఎస్ ఒక్కటే అని ప్రజలు స్పష్టంగా తీర్పునిచ్చారని తెలిపారు. ఇది నిజంగా తమకు సానుకూలమైన అంశమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా .. నియోజకవర్గ స్థానిక నాయకత్వం అద్భుతంగా కష్టపడిందని అన్నారు. వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత రాజకీయాలకు కొత్త అయినప్పటికీ అద్భుతంగా పనిచేశారని.. పోరాటం చేశారని అన్నారు. ఆమెకు అభినందనలు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్షంగా తన పాత్రను అద్భుతంగా పోషించిందని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ముందు పెట్టడంలో బలంగా బీఆర్ఎస్ పనిచేస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇది కొనసాగుతుందని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నిజాయతీగా కొట్లాడమని స్పష్టం చేశారు. ఎన్నికలు ఎలా జరిగాయో అందరికీ తెలుసని అన్నారు. ప్రతి సర్వేలో బీఆర్ఎస్ గెలుస్తుందని ఎలా చెప్పింది.. ఆఖరి మూడు రోజుల్లో ఏం జరిగిందో ప్రజలు చూశారని అన్నారు. అయినప్పటికీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నయం బీఆర్ఎస్‌నే అని ప్రజలు స్పష్టం చేశారని తెలిపారు.

2014 నుంచి 2023 వరకు దాదాపు ఏడు ఉప ఎన్నికలు జరిగాయని కేటీఆర్ తెలిపారు.ఈ ఉప ఎన్నికల్లో అప్పటి ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఒక్క ఉప ఎన్నికల్లో కూడా గెలవలేదని గుర్తుచేశారు. దాదాపు ఐదింటిలో తాము గెలిచామని అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలో కూడా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఒకటి రెండు సీట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజల తరపున వాదనను బలంగా వినిపించామని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలను, ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లామని పేర్కొన్నారు. హామీల ఎగవేతను బాకీ కార్డుల రూపంలో ప్రధాన చర్చనీయాంశంగా చేయగలిగామని అన్నారు. ఇది బీఆర్ఎస్ సాధించిన విజయమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో లబ్ధి కోసం కులం, మతం పేరుతో డైవర్షన్ రాజకీయాలు చేయలేదని కేటీఆర్ తెలిపారు. బూతులు అస్సలు మాట్లాడలేదని పేర్కొన్నారు. హుందాగా కేవలం ప్రజాసమస్యలపై మాత్రమే కొట్లాడామని తెలిపారు. జనాలకు అవసరమైన పాయింట్లను మాత్రమే చర్చకు పెట్టామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎంత కవ్వించేందుకు యత్నించినా కూడా సమన్వయం పాటించామని అన్నారు.

పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశామో కూడా తెలిపామని అన్నారు. 5328 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని లెక్కలతో సహా ప్రజల ముందు పెట్టామని అన్నారు. కాంగ్రెస్ ఎగ్గొట్టిన వాటిని కూడా లెక్కలతో సహా ఇంటింటికీ తీసుకెళ్లామని తెలిపారు. ‘ బస్సు చార్జీల పెంపుపై నిరసన, బస్తీ దవాఖానాల్లో పర్యటించి ప్రభుత్వ యంత్రాంగంలో చలనం తీసుకొచ్చాం.. హైడ్రా విధ్వంసంపై ప్రభుత్వాన్ని ఎండగట్టాం.. ఆటో అన్నల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాం. హైదరాబాద్‌లో రోడ్ల దుస్థితి విషయంలో కూడా ప్రభుత్వాన్ని కదిలించాం. శాంతి భద్రతల విషయంలో కూడా మా నిరసనను తెలిపాం.’ అని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలనే కేంద్ర బిందువుగా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని హుందాగా నిర్వహించిందని అన్నారు. తద్వారా ప్రభుత్వం కూడా మాట్లాడకతప్పని అనివార్యత కల్పించామని తెలిపారు. రెండేళ్లలో ఒక్కసారి కూడా సమీక్ష చేయని ముఖ్యమంత్రి.. ఆఖరి రోజు ఆరు గ్యారంటీల మీద సమీక్ష చేయని పరిస్థితి వచ్చిందంటే అది బీఆర్ఎస్ విజయమే అని స్పష్టం చేశారు. రెండేళ్లలో మైనార్టీలకు స్థానం లేదు.. దీనిపై బీఆర్ఎస్ గట్టిగా మాట్లాడి.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వాల్సిన అనివార్యతను కల్పించామని అన్నారు.



# ఎంఎన్ఎస్ - టుడే చాణక్య లెక్క పక్కా

**51 శాతం ఓట్లు సాధించిన కాంగ్రెస్**

**ప్రీపోల్, ఎగ్జిట్ పోల్ సర్వేలోనూ అదే ట్రెండ్**

**హైదరాబాద్, మహా:** ఎంఎన్ఎస్ తెలుగు టుడే చాణక్య సర్వేస్ కలిసి జూబ్లీహిల్స్ గ్రౌండ్ రిపోర్ట్‌ను పక్కాగా అందించాయి. పోలింగ్ కు ముందే కాంగ్రెస్‌పార్టీ 51శాతం ఓట్లు సాధిస్తుందని, 20వేల మెజారిటీ సాధించే అవకాశముందని స్పష్టంగా చెప్పింది. ప్రీపోల్ సర్వేలో కాంగ్రెస్ కు 51.2శాతం వస్తాయని అంచనా వేసిన ఎంఎన్ఎస్ తెలుగు టుడే చాణక్య, పోస్ట్ పోల్ సర్వేలో కూడా 51శాతం ఓట్లు సాధిస్తుందని ఖరాఖండిగా చెప్పింది. అదే ఫలితం శుక్రవారం వెల్లడైన ఫలితాల్లో కనిపించింది. తుది ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 98988 ఓట్లు 50.83 శాతం పోలైన ఓట్లలో సాధించారు. దీంతో ఎంఎన్ఎస్ లెక్కలు పక్కాగా చెప్పిందని, సరైన అంచనా వేసిందంటూ పలువురు అభినందించారు. పెద్దసంఖ్యలో మెసేజ్ లు కూడా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య కనీసం 9శాతం గ్యాప్ ఉంటుందని ఎంఎన్ఎస్ టుడే చాణక్య పేర్కొనగా, దాదాపు 12 శాతానికి పైగా ఆధిక్యతను కాంగ్రెస్ పొందింది. షెడ్యూల్ రాకముందే గత మూడునెలలుగా గ్రౌండ్‌లో ఉంటూ పరిస్థితిని ఎప్పటికపుడు అంచనా వేసిన ఎంఎన్ఎస్ తెలుగు టుడే చాణక్య ఫైనల్ గా క్షేత్రస్థాయి లెక్కలను పక్కాగా చెప్పి తన విశ్వసనీయతను మరో సారి చాటుకుంది.

# మంత్రులు సక్సెస్

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాల్లో మంత్రుల పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. ప్రతీ డివిజన్‌లో మంత్రులు భారీ ఆధిక్యం తెచ్చారు. ఫలితంగా జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ రికార్డ మెజారిటీ సాధించింది. రహమత్‌నగర్‌లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి భారీమెజారిటీ అందించారు. వెంగళరావునగర్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిలు మెజారిటీ అందించారు. కమ్మ వర్గం ఓట్ల మళ్లింపులో మంత్రి తుమ్మల సక్సెస్ అయ్యారు. షేక్‌పేట్‌లో మంత్రులు వివేక్, సురేఖ బీఆర్ఎస్ ను అడ్డుకుని మెజారిటీ అందించారు. ఎర్రగడ్డలో మెజారిటీని దామోదర రాజనర్సింహ అందించారు. యూసుఫ్‌గూడలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ సక్సెస్ అయ్యారు. బోరబండలో సీతక్క ప్రభావం చూపింది.

# కర్మ హిట్స్ బ్యాక్

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన ట్వీట్
- బీఆర్ఎస్ ఉప ఎన్నిక ఫలితాల టార్గెట్‌గా కామెంట్

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత వివాదాస్పద ట్వీట్చే శారు. ఎక్స్ వేదికగా తన అధికారికలో 'కర్మ హిట్స్ బ్యాక్' (కర్మ అనుభవించాల్సిందే) అని ట్వీట్ చేశారు. ప్రస్తుతం కవిత చేసిన ట్వీట్ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఎమ్మెల్సీ కవిత ఎవరినీ ఉద్దేశించి ఈ ట్వీట్ చేశారు?, ఆ ట్వీట్ వెనక ఆంతర్యం ఏంటి?, బీఆర్ఎస్ ఓటమిని ఉద్దేశిస్తూ ఆమె ఈ ట్వీట్ చేశారా? అనే చర్చ జరుగుతోంది.

# వైభవంగా ప్రజా ప్రభుత్వ వార్షికోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని పలు అంశాల మీద చర్చించారు. సమీక్షలో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహించుకుంటున్నాం. డిసెంబర్ 8న ప్రజా ప్రభుత్వ రెండో వార్షికోత్సవం వైభవంగా నిర్వహించాలి. డిసెంబర్ 9 న తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించుకోబోతున్నాం. తెలంగాణ భవిష్యత్‌కు రోడ్ మ్యాప్ రూపొందించుకోబోతున్నాం. పాలసీ ఆధారంగానే భవిష్యత్ నిర్ణయాలను తీసుకునేందుకు వీలుంటుంది. పాలసీ డాక్యుమెంట్ తో పెట్టుబడిదారులకు ఒక స్పష్టత వస్తుంది. శాఖల వారీగా పాలసీలకు సంబంధించి సమ్మిట్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఈ నెలాఖరులోగా శాఖల వారీగా పాలసీ డాక్యుమెంట్ సిద్ధం చేయాలి. ఈ గ్లోబల్ సమ్మిట్ కు వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించండి.

# ఓటమిని విశ్లేషించుకుంటాం

- ఎంఐఎం మద్దతు, డబ్బుతోనే కాంగ్రెస్ గెలిచింది
- జీహెచ్ఎంసీ మేయర్ పదవి గెలుచుకోవడమే మా లక్ష్యం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ఢిల్లీ, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమిని విశ్లేషించుకుంటామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రజా తీర్పును గౌరవిస్తామని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎంఐఎం సహకరించడం వల్లే కాంగ్రెస్ పార్టీ గెలిచింది అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఏం చేశాడని అనుకూలంగా ఆయనకు ఓటేయాలి అని ఆయన ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో మేము ఎప్పుడూ ఒక కార్పొరేటర్ కూడా గెలవలేదు. స్వాతంత్రం వచ్చినప్పుడు నుంచి ఎప్పుడు గెలవలేదు. మేము ఉన్నంతలో ప్రయత్నం చేశాం. ఎంఐఎం మద్దతు, డబ్బుతోనే జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. ప్రత్యేక పరిస్థితులలో జూబ్లీహిల్స్ ఎన్నికలు జరిగాయి. మా పార్టీ అక్కడ బలహీనంగా ఉంది. ఓటమిని విశ్లేషించుకుంటాము. ఓల్డ్ సిటీలో కూడా ఏ పార్టీ గెలవదు. ప్రజా తీర్పును మేము శిరసా వహిస్తాం. ఎంఐఎం సహకరించడం వల్లే కాంగ్రెస్ పార్టీ గెలిచింది.

**మా టార్గెట్ జీహెచ్ఎంసీ మేయర్..**

రేవంత్ రెడ్డి ఏం చేశాడని అనుకూలంగా ఆయనకు ఓటేయాలి?. రెండు పార్టీలు కూడా కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాయి. కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదు. దీనిపై మేము ఫిర్యాదు చేస్తాం. జీహెచ్ఎంసీ ఎన్నికలపై దృష్టిపెట్టాం. జీహెచ్ఎంసీ మేయర్ పదవి గెలుచుకోవడమే మా లక్ష్యం. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అనేక చోట్ల డిపాజిట్లు దక్కలేదు' అని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి బీహార్ ప్రజలు పట్టడం కట్టారు. మేము ఊహించనంత భారీ విజయాన్ని ప్రజలు ఇచ్చారు. ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ విష ప్రచారాన్ని తిప్పికొట్టారు. దేశమంతా ఎస్ఐఆర్ జరగాలి. జూబ్లీహిల్స్‌లో ఓటర్ జాబితా తప్పులు తడకగా ఉంది. కాంగ్రెస్ పార్టీ పని అయిపోయింది. ప్రజల దృష్టిలో రాహుల్ గాంధీ నవ్వుల పాలయ్యారు అని ఎద్దేవా చేశారు.

# ఓటమిని విశ్లేషించుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ నేతల తీరు చూసే రాబోయే జీహెచ్ఎంసీ, లోకల్ బాడీ ఎన్నికల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. బీజేపీ కార్యకర్తలు నేతలు ఎక్కడికి వెళ్లి తలదాచుకోవాలో చెప్పాలన్నారు. జూబ్లీహిల్స్ ఓటమికి బాధ్యులు ఎవరని అడిగారు. బీజేపీని బండి సంజయ్, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇలా అయితే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం కలలాగానే మిగిలిపోతుందన్నారు. నేను కిషన్‌రెడ్డిని టార్గెట్ చేయడం లేదని.. పార్టీ నాశనం అవుతుందని తన బాధ అని ఆవేదన వ్యక్తం చెందారు ఎమ్మెల్యే రాజాసింగ్.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కాంగ్రెస్ పాలనావిజయం

**పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని, అందువల్లే ఈ గెలుపు సాధ్యం అయిందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ రెండేళ్ల పాలనకు నిదర్శనం అని, కాంగ్రెస్ పరిపాలనపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# నవీన్‌ను గెలిపించినందుకు థ్యాంక్స్

**ఎంఐఎం అధినేత ఓవైసీ**

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీపై ఏఐఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ కింది స్థాయికి పడిపోయిన పార్టీ అని ఈ సందర్భంగా సంచలన కామెంట్స్ చేశారు. నన్ను విమర్శిస్తే బలపడతామని బీఆర్ఎస్ అనుకుంటోందని అన్నారు. అజారుద్దీన్‌పై కోపం నాపై తీర్చుకుంటున్నారని కామెంట్స్ చేశారు.

# నవీన్ యాదవ్‌కు మంత్రి?

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మక సవాలుగా మారిన ఈ ఎన్నికలో.. నవీన్ యాదవ్ విజయం సాధించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి, ప్రభుత్వానికి భారీ ఊపునిచ్చింది. ఈ ఎన్నికలో ముఖ్యమంత్రి, మొత్తం కాంగ్రెస్ కేబినెట్ ఒకవైపు, బీఆర్ఎస్ అధినాయకత్వం మరోవైపు నిలబడి హోరాహోరీగా పోరాడాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఎన్నికలో గెలిచినందున.. నవీన్ యాదవ్‌కు మంత్రి పదవి దక్కుతుందా అనే చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో బలంగా నడుస్తోంది. పరిస్థితులు కూడా అందుకు అనుకూలంగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు బీసీ నినాదాన్ని బలంగా వినిపించింది. రాష్ట్రంలో బీసీలకు సముచిత స్థానం కల్పించే ఉద్దేశంతోనే కుల గణన చేపట్టింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కట్టబెట్టడానికి ప్రయత్నించినా.. కోర్టుల అడ్డంకులు, కేంద్రం నుంచి మద్దతు లేకపోవడంతో ఆ ప్రయత్నం పూర్తిగా ఫలించలేదు. అందుకే.. బీసీలకు కేబినెట్‌లో మరిన్ని స్థానాలు కల్పించాలనే యోచనలో కాంగ్రెస్ అధిష్ఠానం ఉంది. రాబోయే మంత్రివర్గ విస్తరణలో ఇద్దరు లేదా ముగ్గురు బీసీ నేతలకు అవకాశం దక్కే ఛాన్స్ ఉంది.

# మహేష్ గౌడ్ హిట్.. రాంచందర్ రావు ఫ్లాప్

## తెలంగాణ పాలిటిక్స్‌లో చీఫ్‌లపై చర్చ





**హైదరాబాద్, మహా:** రెండు జాతీయపార్టీలు.. ఇద్దరు చీఫ్ లు.. ఒక సవాల్. జూబ్లీహిల్స్ ఎన్నికలు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్యే ప్రధానంగా జరిగినప్పటికీ జాతీయ పార్టీ బీజేపీ తన సత్తా చాటుకునేందుకు పోటీ చేసి డిపాజిట్ కోల్పోయింది. ఈ సందర్భంగా చీఫ్ లపై చర్చ టాక్ ఆఫ్ తెలంగాణ గా మారింది. కాంగ్రెస్ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తొలి బైపోల్ లోనే హిట్ కాగా, బిజెపి చీఫ్ హయాంలో అభ్యర్థి డిపాజిట్ గల్లంతు కావడం.. అదీ పార్టీ ఎంపీ ప్రాతినిధ్యం వహించే నియోజ్వర్గంలో కావడం చర్చగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల నాటికి టీపీసీసీకి అధ్యక్షుడిగా ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఉన్నాడు. అయితే ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించిన పార్టీగా నిలబెట్టడంతో రేవంత్ రెడ్డి విజయం సాధించడంతో ఆయనకు ముఖ్యమంత్రి పదవి దక్కడంతో టీపీసీసీ నుంచి తప్పుకున్నాడు. దీంతో ఆ అవకాశం ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ను వరించింది. దీంతో కొత్త టీపీసీసీ చీఫ్ గా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. బీజేపీ విషయానికొస్తే పార్లమెంట్ ఎన్నికల నాటికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి వ్యవహరించారు. అయితే ఆయనకు కేంద్ర మంత్రి వర్గంలో చోటు కలిపించడంతో ఆయన కూడా బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవలసి వచ్చింది. దీంతో పార్టీ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావుకు ఆ అవకాశం దక్కింది. దీంతో ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు. అంటే ఒక రకంగా రెండు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు ఒకే సమయంలో నూతన రాష్ట్ర అధ్యక్షులుగా వీరిద్దరూ నియమితులయ్యారు. వీరి నియమకం తర్వాత వచ్చిన ప్రధాన ఎన్నిక జూబ్లీహిల్స్ ఎన్నిక. ఈ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల అధ్యక్షులుగా వారి పాత్రపై ప్రస్తుతం చర్చ సాగుతోంది.

### కాంగ్రెస్ అలర్ట్.. బిజెపి నెగ్లెక్ట్

అందరికంటే ముందుగా బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రకటించగానే కాంగ్రెస్ అప్రమత్తమైంది. అజారుద్దీన్, బొంతు రామ్మోహన్, అంజనీకుమార్ యాదవ్, నవీన్ కుమార్ యాదవ్ తదితరులు పోటీపడినప్పటికీ స్థానికుడైన నవీన్‌కు టికెట్ ఖరారుచేసింది. బీసీ అభ్యర్థికి టికెట్ ఇస్తే గెలిచే అవకాశాలు ఉంటాయని భావించడంతో పాటు స్థానికంగా నవీన్‌కు ఉన్న ఇమేజ్ ను కూడా గుర్తించడంలో పార్టీ సక్సెస్ అయ్యింది. అదే సమయంలో మైనారిటీలను సంతృప్తి పరచడం కోసం అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడంతో పాటు మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా సక్సెస్ అయ్యారు. ఇక ఎన్నికల ప్రచారం విషయంలోనూ మహేష్ కుమార్ గౌడ్ అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. నియోజకవర్గానికి ముగ్గురు మంత్రులను ఇన్‌చార్జ్‌లుగా పెట్టి ఎప్పటికపుడు వారితో సమన్వయం చేయడం పార్టీకి కలిసివచ్చింది. మరోవైపు మిగిలిన మంత్రులను, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ క్యాడర్‌ను ఆయా ప్రాంతాల్లో మోహరించి తక్కువ సమయంలోనే నియోజకవర్గంపై మహేష్ గౌడ్ పట్టు సాధించారు. దానితో నవీన్‌కుమార్ విజయం నల్లేరుమీద నడక అయ్యిందనేది వాస్తవం. ఇదే పరిస్థితి కొనసాగితే, సీఎంతో సమన్వయం కొనసాగిస్తే వచ్చే స్థానిక, జీహెచ్ఎంసీ ఎన్నికల విజయం కూడా వార్ వన్ సైడే అన్నట్లు ఉంటుందన్న చర్చ ఉంది.

### లైట్ తీసుకుని దెబ్బతిని

జూబ్లీహిల్స్ ఎన్నికను కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. కానీ, అదే సమయంలో బీజేపీ మాత్రం తేలికగా తీసుకుందనే అభిప్రాయం ఉంది. కనీసం అభ్యర్థిని ఎంపిక చేసే విషయంలోనూ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న రాంచందర్ రావు కేంద్ర నాయకత్వంతో సమన్వయం చేయలేకపోయారన్న అపవాదు ఉంది. మిగిలిన పార్టీలు అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతున్న సమయంలోనూ ఆయన పెద్దగా స్పందించలేదు. అభ్యర్థిని ప్రకటించిన తర్వాత ఎన్నికల ప్రచారానికి ఎలాంటి వ్యూహం లేకుండానే బరిలోకి దిగడం తొలి ఫెయిల్యూర్ అని చెప్పవచ్చు. పార్టీకి రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు, 8మంది ఎమ్మెల్యేలు, 2 ఎమ్మెల్సీలు ఉన్నప్పటికీ వారిని సమన్వయం చేయడంలోనూ వారిని నియోజకవర్గంలో మోహరించడంలోనూ రాంచందర్‌రావు పూర్తిగా విఫలమయ్యారన్న టాక్ వినపడుతోంది. కనీసం స్థానిక నాయకులను కూడా పార్టీ ప్రచారానికి సరైన రీతిలో వినియోగించుకోలేదన్న అపవాదు ఉంది. అంతేకాక ఎన్నికల ప్రసంగాల్లోనూ అంత ఊపు లేకపోవడం, ఆకట్టుకునే వాగ్ధాటి ఉన్న నాయకులు లేకపోవడం , ఉన్న ఒకరిద్దరూ నాయకులను సరిగా వినియోగించుకోకపోవడంతో ఉప ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూటకట్టుకుంది. బీజేపీలో ప్రస్తుతం గెలిచినవారంతా వారి వారి వ్యక్తిగత ఇమేజ్ మీదే గెలిచారనే ప్రచారంఉంది. క్రమశిక్షణ గల పార్టీగా చెప్పుకునే బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయా నాయకులను సమన్వయం చేసుకోవడంలో మాత్రం విఫలమయ్యారనే విమర్శలు ఉండనే ఉన్నాయి.

# బిహార్‌లో ఎన్డీయే సునామీ

## 243 స్థానాలకుగాను 203 చోట్ల జయభేరి

- బిహార్ ప్రజలు మరోసారి అభివృద్ధి నినాదానికే జై
- ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలదన్నేలా ఎన్‌డీఏ విజయం
- విపక్ష మహాగఠ్‌బంధన్ కేవలం 34 స్థానాలకే పరిమితం
- ఖాతా తెరవలేకపోయిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్
- 5 స్థానాల్లో గెలిచిన ఎంఐఎం.. ఒక్క స్థానం దక్కించుకున్న బహుజన్ సమాజ్ పార్టీ

(మొదటిపేజీ తరువాయి)

బిహార్ ప్రజలు మరోసారి అభివృద్ధి నినాదానికే జై కొట్టారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలదన్నేలా ఎన్‌డీఏ కూటమికి అద్భుత విజయాన్ని కట్టబెట్టారు. 243 అసెంబ్లీ స్థానాల్లో సాధారణ మెజారిటీకి 122 సీట్లు అవసరం కాగా, ఏకంగా 203 స్థానాల్లో విజయాన్ని కట్టబెట్టారు. బీజేపీ, జేడీయూ, ఎల్జేపీరామ్‌విలాస్ పాసవాన్, హిందూస్తానీ ఆవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్‌మోర్చా పార్టీలు ఎన్‌డీఏ కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. బీజేపీ, జేడీయూ చెరో 101 స్థానాల్లో పోటీ చేయగా, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీరామ్‌విలాస్ పార్టీ 29 చోట్ల బరిలో నిలిచింది. హిందూస్థానీ ఆవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్‌మోర్చాలు చెరో 6 స్థానాల్లో పోటీ చేశాయి.

### బీజేపీ 90, జేడీయూ 85..

బీజేపీ 90, జేడీయూ 85, ఎల్జేపీరామ్‌విలాస్ పార్టీ 19 స్థానాల్లో గెలుపొందాయి. హిందూస్తానీ ఆవామ్ మోర్చా 5, రాష్ట్రీయ లోక్‌మోర్చా 4 చోట్ల విజయం సాధించాయి. ఉపముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత సామ్రాట్ చౌదరీ తారాపూర్‌లో 45,843 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా, మరో డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా లఖిసరాయ్‌లో విజయ ఢంకా మోగించారు. దానాపూర్‌లో రామ్ కృపాల్ యాదవ్ 29,133 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. జానపద గాయని, బీజేపీ అభ్యర్థి మైథిలీఠాకూర్ అలీనగర్ నుంచి విజయం సాధించారు. ఆమెకు సామాజిక మాధ్యమాల్లో భారీ ఫాలోయింగ్ ఉంది. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా శబరిని ఉద్దేశిస్తూ మైథిలీ పాడిన పాటను ప్రధాని అభినందించారు కూడా. ఎన్నికల సమయంలో హత్య కేసులో అరెస్ట్ అయ్యి జైల్లో ఉన్న జేడీయూ అభ్యర్థి అనంత్ కుమార్ సింగ్ మొకామా నియోజకవర్గంలో 28వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.


### 34 పరిమితం.. కుప్పకూలిన మహాగఠ్‌బంధన్..

మహాగఠ్‌బంధన్ ఈ ఎన్నికల్లో ఘోర ఓటమి చవిచూసింది. కేవలం 33 స్థానాల్లో మాత్రమే ఆ కూటమి ప్రభావం చూపగలిగింది. మహాకూటమిలో అతిపెద్ద పార్టీ అయిన ఆర్‌జేడీ 143 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ 24 స్థానాలు మాత్రమే గెలుచుకోగలిగింది. అయితే గుడ్డిలో మెల్ల నయం అన్నట్లుగా మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి లాలూప్రసాద్ యాదవ్ కుమారుడు తేజస్వీ యాదవ్ రాఘోపూర్‌లో 14వేలకు పైగా మెజారిటీతో గెలుపొందారు. ఆ నియోజకవర్గంలో ఆయనకు ఇది వరుసగా మూడో విజయం కావడం గమనార్హం. కాంగ్రెస్ విషయానికి వస్తే, ఆ పార్టీ 61 స్థానాల్లో పోటీ చేయగా, కేవలం 6 సీట్లు మాత్రమే పొంది ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. విపక్ష కూటమిలోని వామపక్ష పార్టీల్లో సీపీఐ(ఎం) ఒక స్థానంలో, సీపీఐఎంఎల్ 2 స్థానాల్లో, ఐఐపీ ఒక స్థానంతో సరిపెట్టుకున్నాయి. వికాసీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) అయితే కనీసం ఖాతా కూడా తెరవలేకపోయింది. కాగా లాలూ ప్రసాద్ యాదవ్ మరో కుమారుడు, జేజేడీ అభ్యర్థి తేజ్ ప్రతాప్ యాదవ్ మహువాలో పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారు.



### అదరగొట్టిన ఎంఐఎం..

ఇక ఏఐఎంఐఎం పార్టీ బిహార్ లోని ముస్లిం మెజారిటీ స్థానాల్లో తనదైన ముద్ర వేసి, ఐదు స్థానాల్లో గెలిచింది. బహుజన్ సమాజ్ పార్టీ ఒకస్థానంలో గెలుపొందింది.




# ఏ ఎన్నిక జరిగినా గెలుపు మాదే..

## జీహెచ్ఎంసీ ఎన్నికను గెలుచుకోవడమే మా లక్ష్యం

### సంక్షేమ పథకాలు, అభివృద్ధి కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి: మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మహా:** రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ తమదే గెలుపని మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడంతో మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక స్పష్టమైన అవగాహన ఉందని, దేశంలోని ఇతర నగరాల్లో కంటే హైదరాబాద్ ను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఆయన ప్రయత్నిస్తారన్ననమ్మకం ప్రజల్లో ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లుగా అమలు చేస్తున్నసంక్షేమ పథకాలు, అభివృద్ధి కాంగ్రెస్ ను గెలిపిస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇక ఏ ఎన్నిక జరిగినా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తిరుగులేని విజయాన్ని కట్టబెడతారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఖచ్చితంగా కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఈసీ అట్టర్ ఫ్లాప్.. నైతిక విజయం నాదే



- డబ్బు, రౌడీయిజం, రిగ్గింగ్‌తో కాంగ్రెస్ గెలిచింది
- అన్ని పార్టీలు కలిస్తే కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చిన మెజారిటీ అది
- బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను సక్రమంగా నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ అట్టర్ ఫ్లాప్ అయిందని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఉప ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని ధ్వజమెత్తారు. కౌంటింగ్ సెంటర్ నుంచి బయటకు వచ్చిన బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత మీడియాతో మాట్లాడారు. రౌడీల కనుసన్నుల్లో.. రౌడీయిజంతో ఈ ఎన్నికలు జరిగాయని అన్నారు. ఒక ఆడబిడ్డను ఎంత హింసపెట్టాలో అంతాపెట్టారని మాగంటి సునీత ఆరోపించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రిగ్గింగ్‌లు చేయించి, రౌడీయిజంతో గెలిచింది అని అన్నారు. పోలింగ్ సెంటర్‌లోనూ తమపై ర్యాగింగ్ జరిగింది అని మాగంటి సునీత ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలు కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడంతో ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందారని మాగంటి సునీత అన్నారు. కాంగ్రెస్ గెలుపు అడ్డదారి గెలుపుగా అభివర్ణించారు.

## డబ్బు, రౌడీయిజం, రిగ్గింగ్...

ఎన్నికల ప్రచారంలో తమను టార్గెట్ చేస్తూ విపరీతంగా ట్రోల్స్ చేశారని ఆరోపించారు. తాము నవ్వినా...ఏడ్చినా తమదే తప్పు అన్నట్లు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినా నైతికంగా విజయం మాత్రం తమదేనని మాగంటి సునీత తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి ఓటు వేసిన వారందరికీ మాగంటి సునీత ధన్యవాదాలు తెలిపారు.అసలు జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు గెలుపు కాదు అని మండిపడ్డారు. అడ్డదారిలో గెలిచారు అంటూ విమర్శించారు. అన్ని పార్టీలు కలిస్తే కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చిన మెజార్టీ ఇది. మేము సింగిల్‌గా పోటీ చేశాం. కౌంటింగ్ సెంటర్‌లో కూడా ర్యాగింగ్ చేశారు. వాళ్లు ఇచ్చిన చీరలు కట్టుకున్నట్లుగా మాట్లాడారు. డబ్బు, రౌడీయిజం, రిగ్గింగ్‌తో కాంగ్రెస్ గెలిచిందని మాగంటి సునీత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# ఏడు చోట్ల ఉప ఎన్నికలు కాంగ్రెస్, బిజెపికి చెరో రెండు

## పంజాబ్‌లో ఆప్.. జార్ఖండ్‌లో జేఎంఎం

**ఢిల్లీ, మహా :** ఆరు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు శుక్రవారంనాడు వెలువడ్డాయి. నవంబర్ 11న పోలింగ్ జరుగగా, ఈరోజు ఫలితాలు ప్రకటించారు. తెలంగాణ, రాజస్థాన్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. జమ్మూలోని నగ్రోటా, ఒడిశాలోని నౌపడలో బీజేపీ గెలుపొందింది. పంజాబ్‌లోని తరన్ తారన్ నియోజకవర్గాన్ని ఆప్ నిలబెట్టుకుంది. బద్గాంలో పీడీపీ, మిజోరంలో ఎంఎన్ఎఫ్ విజయం సాధించాయి. తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,729 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలవగా, బీజేపీ డిపాజిట్ చతికిల పడింది. రాజస్థాన్‌లోని అంటా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రమోద్ జైన్ 15,612 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. జమ్మూలోని నగ్రోటా అసెంబ్లీ నియోజకవర్గాన్ని బీజేపీ నిలబెట్టుకుంది. ఆ పార్టీ అభ్యర్థి దేవయాని రాణా 24,647 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఒడిశాలోని నౌపడ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి జై ఢోలాకియా విజయం సాధించారు. మిజోరాంలోని డంప ఉప ఎన్నికల్లో ఎంఎన్ఎఫ్ అభ్యర్థి లాల్ తన్‌లినా కేవలం 562 ఓట్ల ఆధిక్యంతో జోరం పీపుల్స్ మూమెంట్ అభ్యర్థిపై గెలిచారు. పంజాబ్‌లోని తరన్ తారన్ నియోజకవర్గాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ నిలబెట్టుకుంది. ఆ పార్టీ అభ్యర్థి 68,235 ఓట్లు దక్కించుకుని గెలుపు సొంతం చేసుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కరణ్‌బీర్ సింగ్ బుర్జ్ 22,473 ఓట్లు, సాద్ అభ్యర్థి సుఖ్వీందర్ కౌర్ 7,158 ఓట్లు, బీజేపీ అభ్యర్థి హర్జిత్ సింగ్ సంధు 3,042 ఓట్లు సాధించారు. కాగా, జార్ఖండ్‌లోని ఘట్సిల ఉప ఎన్నికలో జేఎంఎం అభ్యర్థి సోమేశ్ చంద్ర విజయం సాధించారు.



## బీహార్ ఫలితాలపై రాహుల్ విస్మయం

**మహా :** బీహార్ ఫలితాలు ఆశ్చర్యానికి గురిచేశాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొదటి నుంచి సక్రమంగా జరగలేదని ఆరోపించారు. రిజల్ట్స్ విడుదలైన తర్వాత సాయంత్రం ఎక్స్ లో పోస్ట్ చేశారు . బీహార్ ఎన్నికల్లో 243 సీట్లలో అధికార ఎన్డీఏ 200 సీట్లకు పైగా గెలుకుంటే.. ప్రతిపక్ష మహాగట్బంధన్ కూటమి 40 సీట్లు కూడా క్రాస్ చేయలేకపోయింది. దీనిపై స్పందించిన రాహుల్.. బీహార్ ఫలితాలు విస్మయానికి గురిచేశాయని అన్నారు.

# సర్పంచ్ ఎన్నికలకు లైన్ క్లియర్

## 17న నిర్ణయం.. వారంలో షెడ్యూల్

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయం అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊహించని ఉత్సాహాన్ని, రాజకీయంగా కొత్త బలాన్ని ఇచ్చింది. ఈ గెలుపును పునాదిగా చేసుకుని.. ప్రభుత్వం ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా.. గ్రామీణ ప్రాంతాల్లో తమ పట్టును మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలను ఒక సువర్ణావకాశంగా కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మేరకు ఈ నెల 17వ తేదీన తెలంగాణ కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. దీనిలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ (వెనుకబడిన తరగతుల) రిజర్వేషన్ల అంశం ప్రభుత్వం ముందు ఉన్న అతిపెద్ద సవాలుగా మారింది. గతంలో ప్రవేశపెట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టపరమైన (లీగల్) సమస్యలు, అడ్డంకులు ఎదురవుతున్న నేపథ్యంలో.. అధికారులు మరో నివేదికను సిద్ధం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. షెడ్యూల్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతం మించకూడదు. ఈ న్యాయపరమైన పరిమితిని దృష్టిలో ఉంచుకుని.. మొత్తం 50 శాతం పరిమితిలోనే బీసీలకు రిజర్వేషన్లు కేటాయించేలా అధికారులు మార్గాలను అన్వేషించారు. దీనికి సంబంధించి ఒక సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. బీసీ సంఘాల నేతలతో కూడా మంత్రులు మాట్లాడే అవకాశాలున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఈ వారంలో లేదా తదుపరి నెల మొదటి వారంలోగా వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ఎన్నికలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి కొత్త స్థానిక నాయకత్వాన్ని అందించి, పార్టీ బేస్ ను మరింత బలోపేతం చేస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# కాంగ్రెస్ అభ్యర్థి పక్కా లోకల్ బీసీ బిడ్డ

- అందుకే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు
- కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే గెలిపించాయి
- హైదరాబాద్‌లో డ్రగ్స్, క్లబ్స్, పబ్స్‌ను కేటీఆర్ తెచ్చారు
- మంత్రి సీతక్క హాట్ కామెంట్స్



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అభివృద్ధి చేయలేదని మంత్రి సీతక్క విమర్శించారు. డ్రగ్స్ క్లబ్స్ పబ్స్‌ను కేటీఆర్ తెచ్చారని ఆరోపించారు. వాటికి ముగింపు పలకాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించుకున్నారని అన్నారు. అందుకే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలపై మీడియాతో మాట్లాడతూ.. తాము చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపించాయని అన్నారు. సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తమ గెలుపు మంత్రాలుగా పనిచేశాయన్నారు. సీఎం, కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుకు ఈ విజయం ఫలితమన్నారు. బీఆర్ఎస్ తప్పుడు ప్రచారానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని మంత్రి సీతక్క వ్యాఖ్యలు చేశారు.

**ప్రచారం చేసినా కూడా ప్రజలు విశ్వసించలే..**

ఎవరేమి చేశారో జూబ్లీహిల్స్ ప్రజలకు తెలుసన్నారు. 10 ఏళ్లు ఏమి చేయలేని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసినా కూడా ప్రజలు విశ్వసించలేదని అన్నారు. మంత్రివర్గం, కార్యకర్తలు ప్రజలతో ఉన్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి పక్కా లోకల్ బీసీ బిడ్డ అని.. అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సెంటిమెంట్‌ను రగిలించినా కూడా ప్రజలు విశ్వసించలేదని తెలిపారు. మాగంటి గోపీనాథ్ సతీమణి, పిల్లలను ముందు పెట్టినా కూడా ప్రజలు విశ్వసించలేదన్నారు. గతంలో పీజేఆర్ చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసని చెప్పుకొచ్చారు. కేటీఆర్ బుల్డోజింగ్ అని ప్రచారం చేసినా ప్రజలు నమ్మలేదన్నారు. తాము ఎవరిని బుల్డోజ్ చేయలేదని స్పష్టం చేశారు. నగరం మునిగిపోకుండా ఉండేందుకు ప్రజల ప్రయోజనాల దృష్టిలో హైడ్రాను ఏర్పాటు చేశామని వెల్లడించారు. నవీన్ యాదవ్‌కు ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు.



# కేటీఆర్ ఫెయిల్.. ఆయన కింద పనిచేయాలో వద్దో హరీశ్ ఆలోచించాలి

## మంత్రి వివేక్

**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ ఫేక్ ప్రచారాన్ని ప్రజలు తిప్పి కొట్టారని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిచిన సందర్భంగా మాట్లాడిన మంత్రి.. ప్రజలు అభివృద్ధికి మద్దతు ఇచ్చారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి వచ్చినా ప్రజలు కాంగ్రెస్ ను గెలిపించారని అన్నారు. కేటీఆర్ వర్కింగ్ ప్రసిడెంట్ గా ఫెయిల్ అయ్యారని మంత్రి వివేక్ విమర్శించారు. వీక్ లీడర్ షిప్ కారణంగా బీఆర్ఎస్ ఓడిపోతోంది.. కేటీఆర్, హరీష్ మధ్య గొడవలు వచ్చేలా ఉన్నాయి.. వీళ్లిద్దరిలో ఎవరు బెటర్ లీడర్..? అని కార్యకర్తలు ఆలోచించుకోవాలి.. పార్టీ బతకాలంటే ఏం చేయాలి..? ఫెయిల్యూర్ అవుతున్నడు అని ఆలోచించుకోవాలి.. కేటీఆర్ కింద పనిచేయాలా వద్దా అని హరీశ్ ఆలోచించాలి..? అని సూచించారు.



# దిల్ రాజుతో ప్రెస్ క్లబ్ నాయకుల భేటీ

**హైదరాబాద్:** ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతో ప్రెస్ క్లబ్ నాయకులు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కొత్త కమిటీకి దిల్ రాజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రెస్ క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహిస్తున్న ఎక్స్‌పీరియం వద్ద ఫ్యామిలీ పిక్నిక్‌లో పాల్గొనాల్సిందిగా దిల్ రాజును ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, మాజీ కార్యదర్శి రవికాంత్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు దయ్యాల అశోక్ కలిసి ఆహ్వానించారు.

# నితీష్.. మకుటం లేని మహారాజు



(మహా ప్రత్యేకం)

## 20 ఏళ్ళు.. నాన్ స్టాప్ సీఎం

- మరోసారి మళ్ళీ పగ్గాలు అందుకునే ఛాన్స్
- ఊహించని విధంగా నితీష్ నిర్ణయాలు

వయస్సు అయిపోయిందన్నారు.. ఈసారి కష్టం అన్నారు. అయినా నితీశ్ మాత్రం తగ్గేదెలే అన్నట్లు దూసుకుపోయాడు. బీహార్‌లో గత రెండు దశాబ్దాలుగా ఏకఛత్రాధిపత్యం సాగిస్తున్న నితీష్ కుమార్ ఇపుడు కూడా బంపర్ విక్టరీ సాధించాడు. గత ఎన్నికల కన్నా అధికసీట్లు జేడీ యూ సాదించింది. గత 20 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి కుర్చీ నుంచి నితీశ్ లేవడం లేదు (20142015లో ఒక ఏడాది మినహా). ఎన్నికల్లో ఏ పార్టీకి ఎక్కువ స్థానాలు వచ్చినా, ఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసినా నితీశ్ మాత్రం సీఎంగానే కొనసాగుతున్నారు. అయితే ఈసారి నితీశ్ పార్టీ గెలుపు కష్టమని చాలా మంది అంచనా వేశారు. కానీ ఎన్నో డ్రామాలతో నిండిన బీహార్ రాజకీయాల్లో నితీశ్ మకుటం లేని మహారాజులా వెలుగొందుతున్నారు. సాధారణ కుర్మీ కుటుంబంలో జన్మించిన నితీశ్, చిన్నప్పుడు రాజకీయాలకు చాలా దూరంగా ఉన్నారు. అయితే 1970ల చివర్లో జేపీ ఉద్యమంతో ప్రజా జీవనంలోకి అడుగుపెట్టిన నితీశ్ రాజకీయ ప్రయాణం ఓ మహాకథగా మారింది. నితీశ్ ఎదుగుదల ఒక్కరోజులో జరగలేదు. నిశ్శబ్దం, పట్టుదల, కష్టపడి పనిచేయడం.. ఇవే ఆయణ్ని ముందుకు నడిపించాయి. పాత వారిని వదులుకోవడం, కొత్త కూటములు కట్టడం, మళ్లీ పాత వాటిలోకి తిరిగి పోవడం.. నితీశ్ నిర్ణయాలు ఎప్పుడూ ధైర్యంగా, ఊహించని విధంగా ఉంటాయి. ఎప్పుడు ఏ కూటమిలోకి వెళ్లాలి, ఏ సమయంలో ఏ కూటమి నుంచి బయటికి రావాలి అనేది నితీష్ కుమార్ బాగా అవపోసన పట్టేశారు. ఏమి చేసినా, ఎలాంటి నిర్ణయం తీసుకున్నా నితీశ్ అడుగు ముందుకే పడింది. ఏది ఏమైనా బీహార్ వాసుల జీవితాలను కొంతమేరకు అయినా మెరుగుపరిచిన నాయకుడిగా నితీశ్ మన్ననలు అందుకున్నారు. రాష్ట్రంలో వైద్య, విద్య ప్రమాణాలను మెరుగుపరిచారు. బీహార్‌కు ఇన్నేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన నితీశ్ కుమార్ అన్నిసార్లూ ఎమ్మెల్సీగానే ఉన్నారు. నితీశ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన కొత్తలో 1977, 1980, 1985 ఎన్నికల్లో హర్నాట్ నియోజకవర్గం నుంచి మూడు సార్లు పోటీ చేశారు. తొలి రెండు సార్లు ఓటమి పాలై, 1985లో మొట్టమొదటిసారి విజయం సాధించి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక్కసారి కూడా ఎమ్మెల్యేగా పోటీ చేయలేదు.

**నితీష్ కుమార్ చేసిన కూటముల మార్పులు**

2005 నుంచి సుదీర్ఘ కాలం నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో బీజేపీతో కలిసి ఎన్డీఏ కూటమిలోనే కొనసాగారు. కానీ 2013లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీని.. 2014 సార్వత్రిక ఎన్నికలకు ఎన్డీఏ తరపున ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించడంతో నితీష్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో బీజేపీతో పొత్తును తెంచుకున్నారు. ఈ క్రమంలోనే 2015 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘట్‌బంధన్ (ఆర్జేడీ, జేడీయూ, కాంగ్రెస్ పార్టీలతో) కలిసి పోటీ చేసి విజయం సాధించారు. దీంతో ముఖ్యమంత్రి సీటులో నితీష్ కుమార్ కూర్చున్నారు. అయితే ఈ స్నేహం ఎక్కువ కాలం నిలవలేదు. 2017లో మహాఘట్‌బంధన్‌లో కీలకంగా ఉన్న రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నేత తేజస్వీ యాదవ్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో కూటమి నుంచి బయటికి వచ్చి.. తిరిగి బీజేపీతో జతకట్టి ఎన్డీఏ మద్దతుతో మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమిలో భాగంగానే పోటీ చేసి గెలిచి.. మళ్లీ సీఎం అయ్యారు. ఇక బీజేపీ తమ జేడీయూ పార్టీని బలహీనపరిచేందుకు ప్రయత్నాలు చేస్తోందంటూ నితీష్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో 2022లో ఎన్డీఏను వీడి.. తిరిగి కాంగ్రెస్, ఆర్జేడీలతో కలిసి మహాఘట్‌బంధన్‌లో చేరి.. మరోసారు ముఖ్యమంత్రి పీఠం ఎక్కారు. 2022లో జాతీయ స్థాయిలో ఇండియా కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన నితీష్ కుమార్..ఇక ఎన్డీఏ వైపు చూసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిని 2024 సార్వత్రిక ఎన్నికల్లో గద్దె దింపాలనే లక్ష్యంతో ఇండియా కూటమిని బలోపేతం చేసే ప్రయత్నాలు చేశారు.

అయితే ఇండియా కూటమిలో సీట్ల పంపకం, పార్టీల మధ్య సమన్వయం లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నితీష్ కుమార్ 2024 లోక్‌సభ ఎన్నికల ముందు.. ఇండియా కూటమికి షాక్ ఇస్తూ.. తిరిగి ఎన్డీఏ గూటికి చేరారు. ఈ క్రమంలోనే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలోని బీజేపీ సొంతంగా మెజార్టీ స్థానాలు దక్కించుకోకపోవడంతో.. నితీష్ కుమార్ కింగ్ మేకర్ అయ్యారు. జేడీయూ మద్దతుతో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమిలో భాగంగానే 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రస్తుతం ఎన్డీఏలో జేడీయూ కీలక పార్టీగా ఉండటంతో తిరిగి బీహార్ సీఎం కుర్చీ నితీష్ కుమార్‌కే దక్కే అవకాశాలు ఉన్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇపుడు కూడా బీజేపీ, జేడీయూ రెండుపార్టీలు దాదాపు సమానంగా సీట్లు సాధించాయి.

### తొలిసారి సీఎంగా నితీష్ కుమార్

మొట్టమొదటిసారిగా నితీష్ కుమార్.. 2000 మార్చి 10వ తేదీన బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే సరైన మెజార్టీ లేకపోవడంతో 7 రోజుల్లోనే రాజీనామా చేశారు. ఆ తర్వాత పూర్తి స్థాయి మెజారిటీతో 2005 నవంబర్ 24వ తేదీన మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ఇక బీహార్‌లో 2014 మే 20వ తేదీన ముఖ్యమంత్రిగా జితిన్ రామ్ మాంఝీ ప్రమాణ స్వీకారం చేయగా.. 278 రోజుల పాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2015 ఫిబ్రవరిలో మళ్లీ ముఖ్యమంత్రి కుర్చీని ఎక్కిన నితీష్ కుమార్ ఇప్పటివరకు కొనసాగుతూనే ఉన్నారు.



### బీహార్ తికమక లెక్కలు


- ఓట్లు ఉన్నాయి.. సీట్లు లేవు
- ఆర్జేడీకి షాక్.. బిజెపి, బిజెడిల కన్నా అధిక ఓట్లు
- ఆర్జేడీ పార్టీకి 22.9% ఓట్లు.. బిజెపికి 20.6% ఓట్లు

**మహా :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆసక్తికరమైన, విచిత్రమైన లెక్కలు వెలువరిస్తున్నాయి. బీజేపీ, జేడీయూ నేతృత్వంలోని అధికార ఎన్డీఏ కూటమి.. రికార్డు స్థాయిలో 200కు పైగా సీట్లు సాధించి.. ఘన విజయంతో తిరిగి అధికారాన్ని చేజిక్కించుకుంది. అదే సమయంలో బీహార్‌లో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన.. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) పార్టీ మాత్రం గతంతో పోల్చితే.. సీట్ల సంఖ్యలో భారీగా నష్టపోయింది. అయినప్పటికీ.. రాష్ట్రంలోనే గెలిచిన బీజేపీ, జేడీయూ కంటే అత్యధికంగా ఓట్ల శాతాన్ని నమోదు చేసిన పార్టీగా రికార్డుల్లోకి ఎక్కింది. దీంతో ఓట్ల శాతం వచ్చినా.. అవి సీట్లు గెలుచుకునేంత స్థాయిలో రాకపోవడంతో.. ఆ పార్టీ చీఫ్ తేజస్వీ యాదవ్‌కు బిగ్ షాక్ తగిలినట్లయింది. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ ప్రకారం.. తేజస్వీ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ పార్టీ ఈ ఎన్నికల్లో 22.79 శాతం ఓట్లను సాధించింది. ఇది ఎన్డీఏలోని కీలక భాగస్వాములైన బీజేపీ (20.6 శాతం), జేడీయూ (18.9 శాతం) కంటే దాదాపు 2.27 శాతం నుంచి 3.8 శాతం వరకు ఎక్కువ కావడం గమనార్హం. లాలూ ప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని ఆర్జేడీ పార్టీ.. యాదవ్-ముస్లిం సామాజిక వర్గాల స్థిరమైన మద్దతుతో గత కొన్ని దశాబ్దాలుగా బీహార్ ఎన్నికల్లో తమ ఓటు బ్యాంకును 18 శాతం నుంచి 23 శాతం మధ్య నిలకడగా పొందుతోంది. అయితే ఈసారి కూడా ఆ పార్టీకి 22.8 శాతం ఓట్లు వచ్చి స్థిరత్వాన్ని నిరూపించుకున్నా.. సీట్ల సంఖ్యలో మాత్రం భారీ కోత పడింది.

## కాంగ్రెస్‌లో త్వరలో చీలిక

**అదొక ముస్లింలీగ్ మావోయిస్ట్ కాంగ్రెస్ లా మారింది: మోదీ జోస్యం**

**ఢిల్లీ, మహా :** కాంగ్రెస్ పార్టీలో మరోసారి చీలిక వచ్చే అవకాశం ఉందని ప్రధానమంత్రి మోదీ జోస్యం చెప్పారు. కాంగ్రెస్ భాగస్వామ్యులు ఈ విషయాన్ని గ్రహించాలని హెచ్చరించారు. బీహార్‌లో ఎన్డీయే మూడింట రెండు వంతులకు పైగా సీట్లు గెలుచుకుని రికార్డు స్థాయి విజయం సాధించడంతో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఢిల్లీలోని ప్రధాన కార్యాలయంలో ప్రధాని శుక్రవారం సాయంత్రం మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల కమిషన్‌ను తప్పుపడుతోందని, తప్పుడు ఫిర్యాదులు చేస్తోందని, ఓట్ చోరీ వంటి నిరాధార అంశాలను లేవనెత్తుతూ ప్రజలను కులం, మతం పేరుతో విభజిస్తోందని ప్రధాని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి దేశం పట్ల సానుకూల విజన్ లేదన్నారు. అదొక ముస్లింలీగ్ మావోయిస్ట్ కాంగ్రెస్ (ఎంఎంసీ)లా మారిందని చెప్పారు. కాంగ్రెస్ ఎజెండా మొత్తం ఈ అంశంపైనే నడుస్తోందని అన్నారు. ఈ కారణంగానే కాంగ్రెస్‌లో ఒక కొత్త బ్రాంచ్ ఆవిర్భవించబోతోందని, అది కాంగ్రెస్ నెగిటివ్ పాలిటిక్స్ కంటే కూడా దారుణంగా ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నెగిటివ్ పాలిటిక్స్‌పై ఆ పార్టీ మిత్రులు, మద్దతుదారుల్లో కూడా ఆలోచన మొదలైందని, కాంగ్రెస్ తనకు తాను మునగడంతో పాటు తమందరినీ ముంచేస్తుందనే ఆందోళనలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు.



**బీహార్ విజయం.. ఆల్ టైమ్ రికార్డ్**

బీహార్ ప్రజలు ఎన్డీయేకు చారిత్రక తీర్పు ఇచ్చారని , ఎన్డీయే ప్రభుత్వానికి ప్రజామోదం ఉండటం వల్లే బీహార్‌లో ఘనవిజయం సాధించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బీహార్‌లో ఎన్డీయే అఖండ విజయం సాధించడంతో ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో కార్యకర్తలను ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధానికి పార్టీ కార్యాలయం వద్ద ఘనస్వాగతం లభించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 243 స్థానాలకు గానూ ఎన్డీయే 202 సీట్లు కైవసం చేసుకోగా.. తేజస్వి సారథ్యంలోని మహాగఠ్‌బంధన్ కేవలం 35 సీట్లతో ఘోర వైఫల్యాన్ని చవిచూసింది. అన్నారు. కట్టా సర్కార్ ఇక ఎప్పటికీ అధికారంలోకి రాదని విపక్ష కూటమికి చురకలు అంటించారు. భవిష్యత్తులో అసాధారణమైన అభివృద్ధిని రాష్ట్రం చూడనుందని భరోసా ఇచ్చారు. ఎన్డీయేకు 2010 తర్వాత అసాధారణమైన తీర్పును ఈరోజు ప్రజలు ఇచ్చారని, ఎన్డీయేలోని అన్ని పార్టీల తరపున తాను వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. బీహార్‌లోని కొన్ని పార్టీలు బుజ్జగింపు రాజకీయాల కోసం మహిళలు, యూత్‌ను వాడుకునే వారని, అయితే ఈ ఫార్ములా ఇప్పుడు బెడిసి కొట్టిందని అన్నారు.

## బొక్కబోర్లా పడ్డ ప్రశాంత్ కిషోర్


**సొంతరాష్ట్రంలో డకౌట్.. పారని పాచికలు.. మూడేళ్ళయినా కుదరని విశ్వాసం**



**మహా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఎదురులేకుండా నిలిచింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తారుమారు చేస్తూ విజయ ఢంకా మోగించింది. ప్రతిపక్షాల ఎత్తులను చిత్తు చేసింది. ఎన్నికల ముందు నుంచే ఎన్డీఏ, మహాకూటమి మధ్య హోరాహోరీ పోటీ ఉంటుందని అందరూ భావించారు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలో జన్‌సురాజ్ పార్టీ కూడా బీహార్ ఎన్నికల్లో గణనీయమైన మార్పుకు కారణం అవుతుందని భావించగా, సొంతరాష్ట్రంలో ఆయన డకౌట్ అయ్యారు. కనీసం ఖాతా తెరవలేకపోయారు.

**పారని పాచికలు**

ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ స్థాపించిన ప్రశాంత్ కిషోర్.. వివిధ దేశాల ఎన్నికల్లో అనుసరించే ప్రచార శైలిని భారత్‌లో ప్రవేశపెట్టారు. దశాబ్ద కాలానికి పైగా ఎన్నికల వ్యూహకర్తగా దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఎన్నికల్లో సమాచార విశ్లేషణ ఆధారిత విధానాలు అవలంభించడం, బూత్ స్థాయి నిర్వహణ, క్షేత్రస్థాయి సమస్యలు, సోషల్ మీడియా ప్రచారం వంటి సరికొత్త అస్త్రాలతో పలు పార్టీలను విజయ తీరాలకు నడిపించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి పని చేసిన ప్రశాంత్ కిషోర్.. చాయ్ పే చర్చా, అబ్ కీ బార్ మోదీ సర్కార్ వంటి నరేంద్ర మోదీ ప్రధాని కావడంలో కీలక పాత్ర పోషించారు. తర్వాత ఉత్తర్‌ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్, బిహార్ నీతీశ్ కుమార్, పంజాబ్‌లో అమరీందర్ సింగ్, తమిళనాడులో డీఎంకే, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు పనిచేసి.. ఆయా పార్టీలు అధికారంలోకి రావడానికి, గణనీయమైన సీట్లు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. తన వ్యూహాలతో దేశవ్యాప్తంగా ఇంత మంది విజయాలకు కారణమైన ప్రశాంత్ కిషోర్.. తన సొంత రాష్ట్రంలో తొలి ప్రయత్నంలో మాత్రం ఆయన వ్యూహాలు రివర్స్ అయ్యాయనే చెప్పాలి. రాష్ట్రంలో వలసలు తగ్గించి నిరుద్యోగం లేకుండా చేస్తామని చెప్పారు. అభివృద్ధిలో వెనకబడిపోయిన రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రాన్ని మారుస్తానని ప్రతిజ్ఞ చేశారు. అయినా బిహారీలు ఆయన వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఇక సమాచార ఆధారిత ప్రచారం, సోషల్ మీడియా ఉపయోగం, బూత్ స్థాయి నిర్వహణ కూడా పని చేయలేదు. ఎన్నికలకు రెండు మూడు ఏళ్ల నుంచే సన్నద్ధం అవుతున్నా.. ఓటర్లలో తమ పార్టీపై నమ్మకం పెంచడంలో ప్రశాంత్ కిషోర్ విఫలమయ్యారు. రాష్ట్రంలో దాదాపు అన్ని స్థానాల్లో జన్‌సురాజ్ పోటీ చేసినా.. ఖాతా తెరవడానికే ఆపసోపాలు పడింది. దీంతో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్‌సురాజ్ పార్టీ, ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు ఏమాత్రం ప్రభావం చూపించలేకపోయాయి.



అర్ధరాత్రి ఇసుక ట్రాక్టర్ టైర్ల కింద

# నలిగి వ్యక్తి మృతి

**షాద్ నగర్, మహా:** అర్ధరాత్రి ఇసుక ట్రాక్టర్ టైర్ల కింద నలిగి వ్యక్తి మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం కంసాన్ పల్లి దగ్గర చోటుచేసుకుంది మహబూబ్నగర్ జిల్లా బాలానగర్ మండలం సూరారం గ్రామానికి చెందిన దుబ్బా బిక్షపతి అనే వ్యక్తి సూరారం వాగులో నుండి ఇసుక ఫరూక్ నగర్ మండలం చౌలపల్లి గ్రామానికి తీసుకొస్తున్న సమయంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో ట్రాక్టర్ పై నుండి టైర్ల క్రింద పడడంతో టైర్లు బిక్షపతి పై వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు పోస్టుమార్టం నిమిత్తం డెడ్ బాడీని షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అయ్యప్ప మాలధారణ

# పరమ పవిత్రం


**ఆమనగల్లు, మహా:** అయ్యప్ప మాలధారణ ఎంతో పరమ పవిత్రమైనదని,నిష్ఠతో కూడు కున్న కఠోర దీక్ష అని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, గురుస్వాములు తెలిపారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణం లోని అయ్యప్ప కొండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప మాల ధరించారు. అనంతరం ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్వాములు పాల్గొన్నారు.



హిమాయత్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో

# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

**మొయినాబాద్ మహా:** మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లోగల ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జూలేఖ సుల్తానా ఉపాధ్యాయులు కలిసి జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జూలేఖ సుల్తానా మాట్లాడుతూ.. బాల బాలికలు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు సాధిస్తారన్నారు. అలాగే ప్రతి ఒక్కరు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మహేశ్వరి, ఉపాధ్యాయులు అరుణమ్మ, రాములు, సుమిత్ర, శైలజ, భాగ్యలక్ష్మి, సుగుణ, నీలిమ, మమత, కావేరి, రవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులుగా

# మారిన విద్యార్థులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భారతదేశ తొలి ప్రధాని నెహ్రూ జయంతిని జాతీయ బాలల దినోత్సవంగా జరుపుకుంటామని, పటేల్ గూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటవరలక్ష్మి అన్నారు. పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి బోధించారు. ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు

# మీ డబ్బు.. మీ హక్కు

## అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల పరిష్కారం

జిల్లా స్థాయి అవగాహన కమ్ క్యాంపెయిన్

జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రజలు తమ క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, వాటాలు, డివిడెండ్‌లు, మ్యూచువల్ ఫండ్‌లు, బీమా ఆదాయాలు మొదలైన వాటిని క్లెయిమ్ చేసుకోవడానికి వీలు కల్పించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీ డబ్బు, మీ హక్కు" అనే థీమ్‌తో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల పరిష్కారంపై జిల్లా స్థాయి అవగాహనకమ్‌క్యాంపెయిన్ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా, 01.10.2025 నుండి 31.12.2025 వరకు "మీ డబ్బు, మీ హక్కు" అనే ట్యాగ్‌లైన్‌తో ఆర్థిక రంగంలో క్లెయిమ్ చేయని ఆస్తుల పరిష్కారం కోసం జాతీయ స్థాయి ప్రచారం. ఈ ప్రచారం యొక్క లక్ష్యం పౌరులు తమ క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, వాటాలు, డివిడెండ్‌లు, మ్యూచువల్ ఫండ్‌లు, బీమా ఆదాయాలు మొదలైన వాటిని క్లెయిమ్ చేసుకోవడానికి వీలు కల్పించడం జరిగిందని, క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తుల హక్కుదారులు తమ బ్యాంకులను లేదా ఇతర సంస్థలను సంప్రదించి, నిధులను తిరిగి పొందాలని మరియు ప్రచారాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## క్లెయిమ్ చేయని డిపాజిట్లు పెట్టుబడులు...

ఎస్‌బిఐ డిజిఎం ప్రియవ్రత మిశ్రా మాట్లాడుతూ... క్లెయిమ్ చేయని డిపాజిట్లు మరియు పెట్టుబడులు వాటి చట్టబద్ధమైన యజమానులకు తిరిగి ఇవ్వబడతాయని, ఈ ప్రచారం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన పేర్కొన్నారు. ఎస్ఎల్‌బిసి, ఏజీఎం పద్మ జారాణి మాట్లాడుతూ... ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి మరియు ఆర్థిక పారదర్శకతను నిర్ధారించడానికి వారి సంబంధిత కమ్యూనిటీల లో అవగాహనను వ్యాప్తి చేయాలని ఆమె పాల్గొనే వారందరినీ ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సందర్శించారు. శిబిరం ఏర్పాటు చేయడం ద్వారా వినియోగదారులకు సేవలు అందించాయి. సరైన హక్కుదారులకు సెటిల్‌మెంట్ లెటర్‌లను జారీ చేశారు. ఎల్డిఎం పి. సుశీల్ కుమార్, కార్యాలయ అధికారులు, క్లెయిమ్ చేయని ఆస్తులను క్లెయిమ్ చేయడంలో మరియు కష్టమర్లు తమ నిజమైన డబ్బును పొందడంలో సహాయం చేయడంలో అవగాహన కల్పించడంలో అన్ని బ్యాంకర్లు చురుగ్గా వ్యవహరించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సురేష్ మోహన్, శ్రీలక్ష్మి, రామరావు, ఉష, బ్యాంక్ అధికారులు, ప్రజలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నియంతృత్వానికి మరో ఓటమి

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నవీన్ యాదవ్ గెలుపు సంబరాలు**



**షాద్ నగర్, మహా:** అవినీతి, అక్రమాలకు పాల్పడిన బీఆర్ఎస్ పార్టీ మళ్ళీ పాత విధానాలనే పాటిస్తూ అధికార పార్టీకి అభివృద్ధి చేయకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం అన్యాయమని మండిపడ్డారు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు సంబరాలపై శుక్రవారం ఎమ్మెల్యే క్యాపు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,,,ప్రజల తీర్పును ఎవరైనా శిరసావహించాలని అన్నారు.పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను దోచుకోవడమే కాకుండా మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తూ,ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.ఇకనైనా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,మంత్రులు,ప్రజలకు అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ కు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫరూక్ నగర్ మండలం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల్ రాజ్ గౌడ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,ఇబ్రహీమ్, రఘు నాయక్,శ్రీను నాయక్,గంగనమోని సత్తయ్య,కొంకళ్ళ చెన్నయ్య ముదిరాజ్,కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

# సమాజంలోని చెడుకు పిల్లలు దూరంగా ఉండాలి

- ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు
- వివేక విద్యా భారతి పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన



**ఆమనగల్లు, మహా:** బాలల దినోత్సవం అమనగల్లు, కడ్తాలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా బాలల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.బాలలు భావి భారతావని స్వప్నాలని వివేక విద్యా భారతి కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపల్ మహమూద్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ని వాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులంటూ విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. సమాజంలోని చెడుకు పిల్లలు దూరంగా ఉండాలని అందుకు తల్లిదండ్రుల పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలని తెలిపారు. నేటి సమాజంలో విద్యార్థులను చెడు మార్గం వైపు ఉసిగొల్పుతున్న మొబైల్ ఫోన్స్‌కు దూరంగా విద్యార్థులు ఉండాలని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులకు నవంబర్ 14వ తేదీ యొక్క ప్రత్యేకతను, పండిట్ జవహర్లాల్ నెహ్రూ కి విద్యార్థుల పట్ల ఉన్న అమితమైన ప్రేమానురాగాలను గురించి వివరించారు.బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు.అనంతరం బహుమతులు అందజేశారు.

## నెహ్రూ దేశానికి చేసిన సేవలను మరువలేనిది..

**చైర్మన్ యాట గీత నరసింహ**

భారతదేశ మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులతో కలిసి బాలల దినోత్సవాని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరసింహ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ నిర్మాణానికి, బాలల భవిష్యత్తుకు పునాది వేసిన మహానేత నెహ్రూ దేశానికి అమూల్యమైన సేవలు అందించారని తెలిపారు. చిన్నారుల విద్యాభివృద్ధి, రక్షణ, సామాజిక చైతన్యం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు ఇమ్రాన్ నాయకులు బాలరాజు, లకుపతి, రామకృష్ణ, నరేష్ జాదవ్, శ్రీకాంత్, రమేష్, మహేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సామజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అని మరో మారు జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలు నిరూపించాయని కోడూరి రమేష్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి పై, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గణవిజయం సాధించడం పట్ల, ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. సామజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అని మరో మారు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు నిరూపించాయని రమేష్ అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా గ్రామ గ్రామాన ఎగరడం పక్క అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి అన్ని వర్గాలకు న్యాయం చేసేలా ఏబీసీడి వర్గీకరణ, బీసీ లకు 42 శాతం రిజర్వేషన్, మంత్రి మండలి విస్తరణలో అన్ని కులాలకు ప్రాతినిధ్యం వహించేలా విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుందని గుర్తు చేశారు. బీసీలకు రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయం చేస్తే, ఈ రాష్ట్రములో ఉన్నట్టు వంటి బీసీలకు వ్యతిరేక పార్టీలు బిఆర్ఎస్, బీజేపీలు కేసులు వేసి అడ్డుకునట్టు వంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉన్నది. అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిసి బిడ్డ అయిన నవీన్ యాదవ్ ను బరిలో దింపి కాంగ్రెస్ పార్టీ మరియు ప్రభుత్వం బిసిల పక్షపాతి అని నిరూపించుకోవడం జరిగిందన్నారు. అందుకే బిసి వ్యతిరేక శక్తులు బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు వ్యతిరేకంగా, జూబ్లీహిల్స్ ప్రజలు ఈ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్ కు పట్టం కట్టారు. ఇకనైనా బిసి వ్యతిరేకులు బుద్ధి తెచ్చుకోవాలి, లేకపోతే తెలంగాణ రాష్ట్రంలో బిసిలు అందరు కలిసి మీకు భవిష్యత్తు లేకుండా చేస్తారని హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా విజయ డాంక మోవిస్తుందని భవిస్తూ, ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో అధిక మెజారిటీతో విజయం సాధించిన నవీన్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఓట్లు వేసి గెలిపించిన జూబ్లీహిల్స్ ప్రజలకు, కోడూరి రమేష్ కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

## ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్ కే బీహార్ ప్రజల ఆశీర్వాదం

**బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**



**షాద్ నగర్, మహా:** బీహార్ ఎన్నికల గెలుపు స్ఫూర్తి తో తెలంగాణలో అధికారం కోసం సమిష్టిగా పని చేద్దామని బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఈరోజు బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఉద్దేశించి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు బీహార్ ప్రజలను ఎంతో ఆకర్షించాయని, డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారానే బీహార్ అభివృద్ధి సాధ్యమని భావించిన ప్రజలు ఎన్డీఏ కూటమికి 190 కి పైగా స్థానాలను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టారని అన్నారు. నరేంద్ర మోడీ పనితీరు, నితీష్ కుమార్ పట్ల విశ్వాసం బీహార్ ప్రజలు తమ సంపూర్ణ మద్దతును తెలిపారని అన్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో ఒకే తరహా ప్రభుత్వం ఉన్నట్లయితే అభివృద్ధి సాధ్యమని, రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా నాయకులు, కార్యకర్తల సమష్టి కృషిచేత డబుల్ ఇంజన్ సర్కార్ తెచ్చుకుని తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు మోహన్ సింగ్, ఇస్నాతి శ్రీనివాస్, మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, అత్తాపూర్ మహేందర్ రెడ్డి, గణేష్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## నేటి బాలలే రేపటి భారత భావి పౌరులు..

**శ్రీ చైతన్య పాఠశాల చైర్మన్ విద్య..**

**మొయినాబాద్ మహా:** నేటి బాలలు రేపటి భావి భారత పౌరులని శ్రీ చైతన్య పాఠశాల చైర్మన్ విద్య .. డైరెక్టర్ శ్రీధర్ ఏజిఎం పల్లె వెంకట్లు పేర్కొన్నారు. శుక్రవారం మొయినాబాద్ లో గల శ్రీ చైతన్య పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు బాలరాజ్ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులుగా ఎదగాలని విద్యార్థులను వివిధ వేషధారణలతో రూపొందించి. ఆటల పాటలతో విద్యార్థులలో ఉల్లాసాన్ని నింపించారు. ఆయన మాట్లాడుతూ.. మన దేశ మొట్టమొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రు అని పేర్కొన్నారు. మన దేశ పురోగతికి పునాదులు వేసిన మహనీయులని కొనియాడారు. గొప్ప విద్యావేత్త మానవతావాది అని మాజీ ప్రధానమంత్రి గొప్పతనాన్ని వివరించారు. దేశభక్తి గురించి విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. బాల బాలికలు చక్కగా చదువుకొని బంగారు భవిష్యత్ బాటలు వేసుకోవాలని సూచించారు. బాలల చదువు భవితకు వెలుగు అని నినాదిస్తూ.. నేడు యావత్ భారతదేశం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు దేశంలో ఉన్న బాల బాలికలు ఉత్సవముగా మన దేశ మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. నా చిట్టి చేతులు చక్కని రాతలు లేదయ్యే అనే పాట బడిలోన ఆట ఉందిరా బడి లోన పాట ఉందిరా అంటూ పాట పాడుతూ.. విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్యార్థులకు క్రీడోత్సవాలు నిర్వహించి. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బాలరాజ్, పాఠశాల డీన్ వెంకటేశ్వర్ రెడ్డి, ఇన్చార్జి భవాని, ప్రైమరీ ఇన్చార్జి రూప, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధికి ఆద్యుడు జవహర్ లాల్ నెహ్రూ

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, మహా:** భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పరిపాలన దక్షత 78 సంవత్సరాలు గడిచినా నేటికీ మార్గదర్శకమేనని పవిత్ర రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ప్రజాస్వామ్యం కోసం పరితపించిన ఆయన ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారనీ, నెహ్రూ భారత దేశ ఆధునిక రూపశిల్పిగా నిలిచారనీ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ఎల్ఎన్ కాలనీలో జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన జయంతి సందర్భంగా చిన్నారులతో కలిసి జయంతి వేడుకలు జరుపుకోవడం విశేషం ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనంతరం తొలి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నెహ్రూ భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి నాడు ఎంతో జాగ్రత్తతో వేసిన అడుగులే ఇప్పుడు దేశానికి బాటలుగా మారాయన్నారు. దూరదృష్టితో ఆర్థికంగా, సామాజికంగా ఆయన తీసుకొచ్చిన సంస్కరణలకు చెందిన ఫలితాలను ఇప్పుడు దేశ ప్రజలు అనుభవిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్మోహన్ రెడ్డి నేతలు అగ్గనూర్ బస్వం, చెంది తిరుపతి రెడ్డి, ఇంజమురి గోపాల్,మురళీ కృష్ణ,రఘుమా రెడ్డి,ఇబ్రహీం, శ్రీశైలం గౌడ్, కత్తి శేఖరాప్ప, పెంటయ్య, గంగమోని సత్తయ్య, జగదీశ్, కరుణాకర్, వీరశం,ఇసాక్, మంగ అశోక్, నల్లమోని శ్రీధర్, కేదార్నాథ్, రాజు, అన్వర్, రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్,డిస్కో శ్రీను,రవితేజ, నవీన్, రవి కుమార్ ముదిరాజ్, బాల గంగాధర్ తిలిక్,శంకర్ , తదితరులు పాల్గొన్నారు.

# విలువైన జీవితాలను కాపాడుకుందాం: హీరోయిన్ ఆమని

**మొయినాబాద్ మహా:** విలువైన జీవితాలను కాపాడుకుందాం మామమ్మారి గంజాయి డ్రగ్స్ కి దూరం అవుదాం కొడుకుల్లారా బిడ్డలారా దారి తప్పుతున్న ఆ మహమ్మారి గంజాయికి బానిసలు అవుతున్నారు. అంటూ భాషా సంస్కృత శాఖ ఆధ్వర్యంలో రచన నేర్నాల కిషోర్ గానం రమాదేవి పాటను షూటింగ్ మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమత్ నగర్ లో గల చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం నాడు షూటింగ్ నిర్వహించారు. ప్రాంగణమంతా విద్యార్థులతో సందడిగా కోలాహలంగా ఏర్పడింది. ముందుగా ప్రొఫెసర్ ఎమ్మెల్సీ కోదండరాం క్లాప్ కొట్టి మా భూమి డైరెక్టర్ బి.నర్సింగ్ రావు కెమెరా ఆన్ చేసి షూటింగ్ ప్రారంభించారు. నటి ఆమని అద్భుతంగా తన ప్రతిభను చూపించారు. నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు బానిసలై చదువులను మధ్యలో మానేస్తూ..గంజాయి డ్రగ్స్ కు అలవాటై విలువైన జీవితాలను మధ్యలోనే ఆపేయడం బాధాకరమని నేటి సమాజానికి ఇలాంటి సాహిత్యంతో కుడుకున్న పాటలు భవిష్యత్ తరాల విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఈ పాట భవిష్యత్తులో అందరినీ ఆలోచింపచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కుమార్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బేగరి రాజు, మేకగూడెం బిక్షపతి, ప్రైవేటు ఉద్యోగ సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టం సంపత్ కుమార్, కుమ్మరి జనార్దన్,సంపత్ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.




# అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**మొయినాబాద్ మహా:** అర్హులైన ప్రతి ఒక్క పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని సురంగల్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించి. ముగ్గు పోసి భూమి పూజ చేసి ఇంటి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుపేదల కోసం అందరికీ సొంతింటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేసిందని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవారికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అందిస్తుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్క పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలనే సంకల్పంతోని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా ఫిషర్మెన్ నారాయణపురం మహేందర్ ముదిరాజ్, పల్లగోల్ల అశోక్ యాదవ్, పట్నం రాంరెడ్డి, గడ్డం వెంకట్ రెడ్డి, నేరెట్ల రాజు గౌడ్, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కావాలి రమేష్ ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, వైస్ చైర్మన్ జంగయ్య, రాజేష్ గౌడ్, బేగరి రాజు, విజయ్ రాజ్, రాఘవరెడ్డి, చంద్రారెడ్డి, సురంగల్ చారి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొత్తపల్లి విక్రమ్ రెడ్డి, లబ్ధిదారులు గ్రామస్తులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి

**మొయినాబాద్ మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోంది అని చేవెళ్ల శాసనసభ్యుడు కాలే యాదయ్య పేర్కొన్నారు. మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కళ్యాణ లక్ష్మి/ షాది ముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. కల్యాణ లక్ష్మి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీ చేస్తున్నారని పేర్కొన్నారు. నిరుపేదలకు ప్రభుత్వం ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గౌతమ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్, ఎంపీడీవో సంధ్య, టీపీసిసి కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ నారాయణపురం మహేందర్ ముదిరాజ్, పట్నం రామ్ రెడ్డి, గడ్డం వెంకట్ రెడ్డి, నేరెట్ల రాజు గౌడ్, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కావలి రమేష్ ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, వైస్ చైర్మన్ జంగయ్య, ప్రవీణ్, రాజేష్ గౌడ్, విజయ్ రాజ్, ఫిరంగి భాస్కర్, రాఘవరెడ్డి, చంద్రారెడ్డి, సురంగల్ చారి, కొత్తపల్లి విక్రమ్ రెడ్డి, నాయకులు యాదవ్, వివిధ గ్రామాల లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎలాన్ మస్క్ జీవితాన్ని మార్చిన 10 పుస్తకాలు

టెస్లా (Tesla), స్పేస్ఎక్స్ (SpaceX) వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ (Elon Musk) ప్రపంచ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లో మార్పులు తీసుకురావాలని నిరంతరం కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారు. తన ఆలోచనలకు మూలమైన కొన్ని పుస్తకాలు ఆయన జీవితంలో కీలకంగా మారాయని చెప్పారు. ఆ పుస్తకాల జాబితా కింది విధంగా ఉంది.

1. ది హిచ్చికర్స్ గైడ్ టు ది గెలాక్సీ - డగ్లస్ ఆడమ్స్
సైన్స్ ఫిక్షన్ క్లాసిక్
2. ఫౌండేషన్ సిరీస్ - ఐజాక్ అసిమోవ్
స్పేస్ఎక్స్ స్థాపనలో ఈ సిరీస్ ప్రభావం ఉందని మస్క్ పేర్కొన్నారు.
3. అట్లాస్ ష్రగ్డ్ - ఐన్ రాండ్
మస్క్ దీన్ని కమ్యూనిజానికి కౌంటర్ పాయింట్‌గా అభివర్ణించారు.
4. జీరో టు వన్ (Zero to One) - పీటర్ థీల్ (Peter Thiel)
సంచలనాత్మక కంపెనీలను నిర్మించడంపై ఈ పుస్తకం ఎంతో తోడ్పడినట్లు చెప్పారు.
5. బెంజమిన్ ఫ్రాంక్లిన్: యాన్ అమెరికన్ లైఫ్ - వాల్టర్ ఐజాక్సన్
ఆచరణాత్మక ఆవిష్కరణతో సైన్స్‌ను మిళితం చేయడానికి ఈ పుస్తకం ఉపయోగపడినట్లు చెప్పారు.
6. ఐన్‌స్టీన్: హిజ్ లైఫ్ అండ్ యూనివర్స్ - వాల్టర్ ఐజాక్సన్
7. ది సెల్ఫిష్ జీన్ - రిచర్డ్ డాకిన్స్
పరిణామ జీవశాస్త్రంపై రాసిన పుస్తకం.
8. సూపర్ ఇంటెలిజెన్స్ - నిక్ బోస్ట్రోమ్
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్తు గురించి ఆందోళనలను స్పష్టం చేస్తుంది.
9. ది వెల్త్ ఆఫ్ నేషన్స్ - ఆడమ్ స్మిత్
ఆర్థిక శాస్త్రం, స్వేచ్ఛా మార్కెట్లపై రాసిన పుస్తకం.
10. ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్ - జె.ఆర్.ఆర్. టోల్కీన్
చిన్నతనంలో మస్క్ ఈ ఫాంటసీ పుస్తకంతోనే గడిపారు.







# రూల్స్ మార్చరూ..

## ట్రాయ్‌కు జియో విన్నపం

5జీ సాంకేతికత రాకతో అంతర్జాతీయంగా మార్కెట్లలో మార్పులు, టెక్నాలజీ పురోగతికి అనుగుణంగా నెట్ న్యూట్రాలిటీ నిబంధనలను సడలించాలని టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్‌ని రిలయన్స్ జియో కోరింది. దేశవ్యాప్తంగా 5జీ సేవల విస్తరణతో, గేమింగ్ కోసం తక్కువ లేటెన్సీ ఉండే విధంగా, అప్‌లోడ్స్ కోసం వేగం ఎక్కువగా ఉండేలా వివిధ అవసరాలకు తగ్గ వేగంతో ఇంటర్నెట్ లభ్యత ఉండేలా ప్రోడక్టులను రూపొందించాలనే ప్రతిపాదనలు వస్తున్నాయని వివరించింది. బ్రిటన్ నియంత్రణ సంస్థ ఆఫ్‌కామ్ కూడా ప్రత్యేక సర్వీసులు, ప్రీమియం నాణ్యత గల ఇంటర్నెట్ సర్వీసులను అందించేందుకు అనుమతిస్తోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో దేశీయంగా కఠినతరమైన నిబంధనలను సడలించాలని కోరింది. జియో, ఎయిర్‌టెల్‌లాంటి ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు ఏ ఒక్క యాప్, వెబ్‌సైట్ లేదా సర్వీసులపై పక్షపాతం చూపకుండా అన్నింటినీ ఒకే దృష్టితో చూస్తూ, ఒకే రకమైన వేగంతో అందించాలని నెట్ న్యూట్రాలిటీ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. అంతేకాక, నెట్ న్యూట్రాలిటీపై ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో 5జీ, ఎడ్జ్ కంప్యూటింగ్, ఐఓటీ వంటి ఆధునిక సాంకేతికతల వల్ల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ మరింత క్లిష్టమవుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. విపరీతంగా పెరుగుతున్న డేటా వినియోగాన్ని సమర్థంగా నిర్వహించాలంటే నెట్‌వర్క్‌లలో 'క్వాలిటీ ఆఫ్ సర్వీస్' (QoS) ఆధారంగా ప్రాధాన్యత కేటాయించే అవకాశాలు పరిశీలించాల్సి వస్తుందని అభిప్రాయపడుతున్నారు. అయితే ఇదే సమయంలో, వినియోగదారుల ప్రాథమిక హక్కులు, ఏ యాప్‌కైనా సమాన యాక్సెస్ లభించాలనే సూత్రం దెబ్బతినకుండా జాగ్రత్తలు అవసరమని హెచ్చరిస్తున్నారు.

# ఇన్ఫోసిస్ ప్రైజ్ 2025 విజేతల ప్రకటన



విభిన్న రంగాల్లో అత్యుత్తమ కృషి చేసిన ఆరుగురు పరిశోధకులు, శాస్త్రవేత్తలకు ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ (ISF) 'ఇన్ఫోసిస్ ప్రైజ్ 2025'ను ప్రకటించింది. ఆరు వేర్వేరు విభాగాల్లోని సమకాలీన పరిశోధకులు, శాస్త్రవేత్తల విజయాలను గుర్తించి ఏటా ఈ అవార్డును అందజేస్తారు. వీరి ప్రతిభను గౌరవిస్తూ ప్రతి ఒక్కరికీ బంగారు పతకం, ప్రశంసా పత్రం, 1,00,000 డాలర్లు (సుమారు రూ.88 లక్షలు)ఇస్తారు.

**విజేతలు**

**ఫిజికల్ సైన్సెస్:**

కాల్‌టెక్‌లోని కెమికల్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ ప్రొఫెసర్ కార్తీష్ మంతిరామ్ ఈ బహుమతిని గెలుచుకున్నారు. పునరుత్పాదక విద్యుత్తును ఉపయోగించి స్థిరమైన రసాయన ప్రక్రియలను సృష్టించడంపై ఆయన చేసిన కృషికి గాను ఈ అవార్డు లభించింది.

**గణిత శాస్త్రం:**

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ అయిన సవ్యసాచి ముఖర్జీ విజేతగా నిలిచారు. గ్రూప్ డైనమిక్స్, సంక్లిష్ట విశ్లేషణ వంటి గణితంలోని వివిధ రంగాలను అనుసంధానించే ఆయన పరిశోధన, నమూనాలకు గుర్తుగా ఈ గుర్తింపు లభించింది.

**లైఫ్ సైన్సెస్:**

బెంగళూరులోని నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అంజనా బద్రినారాయణన్ విజేతగా నిలిచారు. జీవన వ్యవస్థలను స్థిరంగా, ఆరోగ్యంగా ఉంచే ముఖ్యమైన ప్రక్రియలను అర్థం చేసుకోవడంలో సహాయపడే ఆమె పరిశోధనకు ఈ అవార్డు దక్కింది.

**ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్:**

టొరంటో విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ సుశాంత్ సచ్‌దేవకు ఈ బహుమతి లభించింది. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనికేషన్, ఆరోగ్య సంరక్షణ, రవాణా వ్యవస్థల కోసం మెరుగైన అల్గోరిథమ్‌లను రూపొందించడంలో ఆయన చేసిన కృషికి ఈ అవార్డు లభించింది.

**హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్:**

చికాగో విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ ఆండ్రూ ఓలెట్‌కు ఈ అవార్డు దక్కింది.

**ఎకనామిక్స్:**

ఎంఐటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా ఉన్న నిఖిల్ అగర్వాల్ ఈ అవార్డును గెలుచుకున్నారు. విజేతలను ప్రకటించిన సమావేశంలో ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ట్రస్టీ, ఇన్ఫోసిస్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ..'పరిశోధన చేయడానికి ధైర్యం, పట్టుదల, ఊహ అవసరం. ఇది సైన్స్, సమాజం, విలువలు, నైతికతను వారధిగా ఉపయోగించుకుంటుంది. ఆకలి, పేదరికం, మూఢనమ్మకాలు, ఆచారాలు, సంప్రదాయాల్లోని సమస్యలను సైన్స్ మాత్రమే పరిష్కరించగలదు. భారతదేశాన్ని, ప్రపంచాన్ని మెరుగ్గా మార్చడానికి పరిశోధనే ఏకైక మార్గం' అని పేర్కొన్నారు.

# హోండా రీకాల్: ఈ బైకులపై ఎఫెక్ట్



హోండా మోటార్‌సైకిల్ & స్కూటర్ ఇండియా (HMSI) భారత మార్కెట్లోని బిగ్‌వింగ్ అవుట్‌లెట్‌ల ద్వారా విక్రయించే ప్రీమియం CB1000 హార్నెట్ SP కోసం రీకాల్ ప్రకటించింది. ఇంతకీ కంపెనీ ఎందుకు రీకాల్ ప్రకటించింది?, సమస్య ఏమిటనే వివరాలు ఈ కథనంలో చూసేద్దాం. ఎగ్జాస్ట్ నుంచి వచ్చే వేడి వల్ల సీటు ఉపరితలం మృదువుగా మారే అవకాశం ఉంది. ఈ సమయంలో పెడల్ పివోట్ వదులయ్యే అవకాశం ఉందని హోండా చెబుతోంది. ఈ వేడి కారణంగా గేర్ బోల్ట్ వదులైతే.. అది రైడింగ్ చేస్తున్నప్పుడు పడిపోవచ్చు. తద్వారా గేర్‌లను మార్చేటప్పుడు సమస్య తలెత్తుతుందని కంపెనీ స్వచ్ఛందంగా రీకాల్ ప్రకటించింది.

**జనవరి 2026 నుంచి సర్వీస్**


ఈ సమస్యను పరిష్కరించడానికి.. మోటార్ సైకిల్ వారంటీ స్థితితో సంబంధం లేకుండా, ప్రభావిత భాగాలను కంపెనీ ఉచితంగా చెక్ చేసి భర్తీ చేస్తుంది. రీకాల్ సర్వీస్ జనవరి 2026 నుంచి భారతదేశం అంతటా ఉన్న హోండా బిగ్‌వింగ్ టాప్‌లైన్ డీలర్‌షిప్‌లలో ప్రారంభమవుతుంది. హోండా మోటార్‌సైకిల్.. దాని బిగ్‌వింగ్ డీలర్‌లతో కలిసి కస్టమర్లకు ఫోన్ కాల్స్, ఎస్ఎమ్ఎస్ & ఈమెయిల్స్ ద్వారా రీకాల్ గురించి తెలియజేస్తుంది. అంతేకాకుండా బైక్ ఓనర్స్ అధికారిక హోండా వెబ్‌సైట్‌లో వారి వెహికల్ ఐడెంటిఫికేషన్ నెంబర్ ద్వారా రీకాల్ సమాచారం తెలుసుకోవచ్చు. సర్వీస్ సెంటర్లలో ఆలస్యం కాకుండా ఉండటానికి కస్టమర్‌లు అపాయింట్‌మెంట్‌లను ముందుగానే షెడ్యూల్ చేసుకోవాలని కంపెనీ వెల్లడించింది. హోండా CB1000 హార్నెట్ SP బైక్ 999cc ఇన్‌లైన్ ఫోర్‌సిలిండర్ ఇంజిన్ ద్వారా 155 bhp & 107 Nm ఉత్పత్తి చేస్తుంది. ఇది స్లిప్పర్ క్లచ్, బైడైరెక్షనల్ క్విక్‌షిఫ్టర్, హోండా సెలెక్టబుల్ టార్క్ కంట్రోల్, మెరుగైన పనితీరు కోసం ఐదు రైడింగ్ మోడ్‌లతో వస్తుంది.

# దేశం-విదేశం

# NATIONAL-INTERNATIONAL

# 25 ఏళ్లకే ఎమ్మెల్యేగా అడుగుపెట్టనున్న సింగర్!


బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రముఖ సింగర్ ఘనవిజయం సాధించింది. కేవలం 25 ఏళ్ల వయసులోనే జానపద సింగర్ ఎమ్మెల్యేగా ఎంపికైంది. బీజేపీ నుంచి తొలిసారి అసెంబ్లీకి పోటీ చేసిన మైథిలి ఠాకూర్ విక్టరీ సాధించింది. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సింగర్ మైథిలీ ఠాకూర్.. అలీనగర్ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టనుంది. ఈ ఎన్నికల్లో దాదాపు 11 వేలకు పైగా మెజార్టీలో గెలుపొందింది. కాగా.. 25 ఏళ్ల మైథిలి ఠాకూర్.. బీహార్‌లోని మధుబన్ జిల్లా బెనిపట్టి ఆమె సొంతూరు. జానపద సింగర్‌గా శిక్షణ తీసుకున్న మైథిలి పలు రియాలిటీ షోల్లో పాల్గొంది. స రే గ మ ప లిటిల్ చాంప్స్, ఇండియన్ ఐడల్ జూనియర్, రైజింగ్ స్టార్ రియాలిటీ షోలలో కంటెస్టెంట్‌గా రాణించింది. మైథిలి సొంత యూట్యూబ్ ఛానెల్‌కు 5 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లోనూ ఆమెకు 6.4 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. తన గాత్రంతో అందరినీ ఆకట్టుకున్న మైథిలి.. ఇప్పుడు రాజకీయ నాయకురాలిగా ఎలా రాణిస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# అమెరికన్లకు శిక్షణ ఇవ్వండి.. ఆ తర్వాత వెళ్లిపోండి

## H-1B వీసాలపై యూఎస్ మంత్రి కీలక వ్యాఖ్యలు

విదేశీ ఉద్యోగులు ముఖ్యంగా భారతీయ వలసదారులను అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) నుంచి హెచ్ 1బీ వీసా ప్రోగ్రామ్‌పై అనూహ్య స్పందన వ్యక్తమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయన ఈ వీసా ప్రోగ్రామ్‌ని గట్టిగా సమర్థించారు. ఆయా రంగాల్లో నైపుణ్యం కలిగిన స్వదేశీ ఉద్యోగులు లేని కారణంగా విదేశాల నుంచి నైపుణ్యం తెచ్చుకోవడం దేశానికి అవసరమంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో హెచ్ 1బీ వీసాలపై అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికన్ కార్మికులకు శిక్షణ ఇప్పించేందుకే హెచ్ 1బీ ఉద్యోగాలని తెలిపారు. ఫాక్స్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్కాట్ బెసెంట్ (Scott Bessent) మాట్లాడుతూ.. ట్రంప్ కొత్త H1B వీసా విధానం (H1B visa plan) నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణులను అమెరికన్ కార్మికులకు (US workers) శిక్షణ ఇవ్వడానికి తీసుకురావడానికి రూపొందించబడిందని వెల్లడించారు. అంతేకాని, విదేశీయులను భర్తీ చేసేందుకు కాదని స్పష్టం చేశారు. 'అమెరికన్లకు శిక్షణ ఇవ్వండి. ఆ తర్వాత తిరిగి వెళ్లిపోండి. ఆ తర్వాత అమెరికన్లే పూర్తిగా బాధ్యతలు తీసుకుంటారు' అనేదే వీసా విషయంలో ట్రంప్ కొత్త విధానం అని వెల్లడించారు. విదేశీ కార్మికులపై దీర్ఘకాలంగా ఆధారపడకుండా ఉండేందుకే ఈ నిర్ణయమని తెలిపారు.



# అమెరికాలో ముగిసిన ప్రభుత్వ షట్‌డౌన్


## 43 రోజుల ప్రతిష్టంభనకు ఎట్టకేలకు ముగింపు



**న్యూఢిల్లీ :** అత్యధిక కాలం అమెరికాలో కొనసాగిన ప్రభుత్వ షట్‌డౌన్ ముగిసింది. ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు తాత్కాలికంగా నిధులు విడుదల చేసేందుకు పార్లమెంట్ ఆమోదించిన చట్టంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం సంతకం చేశారు. దీంతో 43 రోజుల పాటు ప్రభుత్వాన్ని స్తంభింపచేసిన రిపబ్లికన్లు, డెమోక్రాట్ల మధ్య వివాదం సమసిపోయింది. ప్రతిష్ఠంభనను ముగించేందుకు సెనేట్ ఆమోదించిన చట్టాన్ని ప్రతినిధుల సభ ఆమోదించింది. తాజా పరిణామం డెమోక్రాట్లకు గట్టి ఎదురుదెబ్బగా పరిశీలకులు భావిస్తున్నారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో ఆమోదించిన ఆరోగ్య బీమా కార్యక్రమాలకు సబ్సిడీలు విస్తరించడానికి సంబంధించిన చట్టాన్ని ప్రస్తుత ట్రంప్ ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో డెమోక్రాట్లు ఆర్థిక బిల్లులకు ఆమోదం తెలపకపోవడంతో షట్‌డౌన్ అనివార్యమైంది. నిబంధనల ప్రకారం ఆర్థిక బడ్జెట్ పార్లమెంట్‌లో ఆమోదం పొందాలంటే రిపబ్లికన్లకు 60 ఓట్లు ఉండాలి. మెజారిటీ లేని కారణంగా ఆర్థిక బిల్లు ఆమోదం పొందలేదు.

# యూఎస్‌లో 17 వేల డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు

**కాలిఫోర్నియా :** అక్రమ వలసదారులుగా పేర్కొంటూ 17 వేల మంది కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్‌లను కాలిఫోర్నియా రద్దు చేసింది. ఈ చర్య భారత, భారత సంతతి డ్రైవర్లను ప్రభావితం చేసే అవకాశముంది. ట్రక్ డ్రైవర్లుగా పనిచేస్తున్న వేలాది మందికి అక్రమంగా లైసెన్స్‌లు జారీ చేశారని డొనాల్డ్ ట్రంప్ సర్కార్ ఆందోళన వ్యక్తం చేయటంతో, కాలిఫోర్నియా ప్రభుత్వం 17 వేల మందిపై చర్యలు చేపట్టింది. ఈ ఏడాది ఆగస్టులో ఫ్లోరిడాలో అక్రమ వలసదారుడు నడిపిన ట్రక్ ప్రమాదానికి కారణమైంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, ట్రక్ డ్రైవర్..భారతదేశానికి చెందిన అక్రమ వలసదారుడని దర్యాప్తులో తేలింది. ఈ ఘటన అమెరికా వ్యాప్తంగా కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్ ఆడిట్‌కు దారి తీసింది.



# అఫ్ఘాన్‌లో మరోసారి భూకంపం..

## 10 రోజుల్లో మూడోసారి

అఫ్ఘానిస్థాన్‌ను వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. తాజాగా మరోసారి అక్కడ భూమి కంపించింది. గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.6గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 140 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. అయితే, ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదు. కాగా, అఫ్ఘాన్‌లో పది రోజుల్లో భూకంపం సంభవించడం ఇది మూడోసారి కావడం గమనార్హం. కాగా, ఈ నెల 4వ తేదీన అఫ్ఘాన్‌ను అత్యంత శక్తిమంతమైన భూకంపం వణికించిన విషయం తెలిసిందే. 6.3తీవ్రతతో సంభవించిన ఈ భూకంపం ధాటికి 27 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 1,000మంది గాయపడ్డారు. ఈ విపత్తులో దేశంలోనే అత్యంత అందమైన మసీదుల్లో ఒకటి తీవ్రంగా దెబ్బతిన్నట్లు తాలిబన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి షరాఫత్ జమాన్ అమర్ తెలిపారు. ఆ తర్వాత నవంబర్ 8వ తేదీన కూడా భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై 4.4 తీవ్రతతో ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఇలా వరుస భూకంపాలతో అఫ్ఘాన్ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. అఫ్ఘానిస్థాన్ హిందూ కుష్ ప్రాంతంలో ఉన్నందున, భారతీయయూరేషియన్ పలకల సంధి కారణంగా అక్కడ తరచూ భూకంపాలు సంభవిస్తాయి నిపుణులు వెల్లడించారు.

# ట్రంప్‌కు సారీ చెప్పిన బీబీసీ..

## పరిహారం మాత్రం ఇవ్వం?

బీబీసీ ,అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు క్షమాపణలు తెలిపింది. క్యాపిటల్ హిల్స్ పై దాడి జరిగిన సందర్భంలో ట్రంప్ చేసిన ప్రసంగాన్ని వక్రీకరించినట్లు అంగీకరించింది. అందుకు క్షమాపణలు కోరుతూ బీబీసీ ఛైర్మన్ వైట్ హౌస్‌కు లేఖ పంపారు. అయితే ట్రంప్ పరువునష్టం దావా వేసిన ఒక బిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇవ్వడానికి మాత్రం బీబీసీ అంగీకరించలేదు. 2021లో క్యాపిటల్ హిల్ పై ట్రంప్ మద్దతు దారులు దాడి చేశారు. ఆ సమయంలో ట్రంప్ చేసిన ప్రసంగాన్ని మరో అర్థం వచ్చేలా ఎడిట్ చేసి బీబీసీ ప్రసారం చేసింది. అయితే తనపై తప్పుడు ప్రసారం చేసినందుకు గానూ బిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని ట్రంప్ బీబీసీకి లేఖ పంపారు. దానికి శుక్రవారం డెడ్ లైన్ విధించారు. దీంతో బీబీసీ ఛైర్మన్ సమీర్ షా క్షమాపణలు కోరుతూ వైట్ హౌస్‌కు లేఖ పంపారు. ట్రంప్ ప్రసంగం చేసిన వీడియో క్లిప్‌ను సవరించినందుకు తీవ్రంగా విచారిస్తున్నామని తెలిపారు. మరోసారి ఆ కార్యక్రమాన్ని బీబీసీలో ప్రసారం చేయమని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కొంతమంది ఆ సంస్థకు చెందిన అధికారులు ఇది వరకే రాజీనామా చేశారు.



**అసలేం జరిగింది**

2021లో క్యాపిటల్ హిల్ పై జరిగిన దాడి సమయంలో ట్రంప్ సూమారు గంట పాటు ప్రసంగం చేశారు. ఆ ప్రసంగంలోని కొంత భాగాన్ని ఎడిట్ చేసి బీబీసీ తన పనోరమ డ్యాకుమెంటరీలో ప్రసారం చేసింది. అందులో " మనం క్యాపిటల్ హిల్ కు వెళుతున్నాం. మీతో పాటు నేను వస్తున్నా. మనం తీవ్రంగా పోరాడుదాం" అని ట్రంప్ అన్నట్లు చూపించింది. అయితే వాస్తవానికి ఆ వీడియోలో శాంతియుతంగా పోరాడుదాం అన్న వ్యాఖ్యలను వక్రీకరించించి ప్రసారం చేసింది. దీంతో ట్రంప్ 1బిలియన్ డాలర్ల పరువు నష్టం దావా వేశారు. ఈ విషయంపై ట్రంప్ కు క్షమాపణలు చెప్పిన బీబీసీ పరిహారం మాత్రం చెల్లించలేదు.



# మార్పు సహజం

తమన్నాకు కోపం వచ్చింది. తనపై లేనిపోని పుకార్లను సృష్టిస్తున్నవారిపై ఆమె అంతెత్తు లేచింది. వివరాల్లోకెళ్తే.. పాత్రల డిమాండ్ మేరకు నటీనటులు బరువులు పెరగాల్సి వస్తుంది. ఒక్కోసారి బరువు తగ్గాల్సి వస్తుంది. ఇది కామన్. అయితే.. ఈ మధ్య బరువు బాగా పెరిగిన తమన్నా తాను చేయబోతున్న పాత్రల కోసం బరువు తగ్గేందుకు కొన్ని ఇంజెక్షన్లు వాడుతున్నదంటూ బాలీవుడ్ మీడియాలో వదంతులు మొదలయ్యాయి. దీనిపై తాజా ఇంటర్వ్యూలో స్పందించింది తమన్నా. 'ఇలాంటి వార్తల వల్ల మీ కెరీర్‌కు ఉపయోగం లేదు. ఈ క్రియేటివిటీని కెరీర్ ఎదుగుదలకు ఉపయోగిస్తే మంచిది. 15ఏండ్ల వయసు నుంచి నటిస్తున్నా. కెమెరా జీవితంలో భాగమైపోయింది. దాదాపు ఇరవై ఏళ్లుగా నన్ను చూస్తున్నారు. నాలో ఏమైనా మార్పు వచ్చిందా? నేను ఇప్పటికీ అలాగే ఉన్నా. ఇందులో దాచడానికి ఏం లేదు. టీనేజ్‌లో ఉన్నట్టే ఇప్పుడూ ఉన్నా. సాధారణంగా ప్రతి స్త్రీకి ప్రతి అయిదేళ్లకోసారి శరీరంలో మార్పులొస్తాయి. అది సహజం. అందుకే ఓకే శరీరాకృతితో కనిపించడం చాలా కష్టం. కానీ నేను అప్పుడెంత వెయిట్ ఉన్నానో, ఇప్పుడు కూడా అంతే ఉన్నా' అని చెప్పుకొచ్చారు తమన్నా.

# చంపాలనుకున్నారా..




ప్రముఖ నటి అదా శర్మ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 2008లో దర్శకుడు విక్రమ్ భట్ తెరకెక్కించిన హారర్ మూవీ '1920' తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన అదా, తన నటనతో మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత టాలీవుడ్‌లో పూరి జగన్నాథ్ – నితిన్ కాంబినేషన్‌లో వచ్చిన 'హార్ట్ ఎటాక్' మూవీతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రంలోని ఆమె ప్రదర్శనకు మంచి ప్రశంసలు లభించాయి. తర్వాత 'సన్నాఫ్ సత్యమూర్తి', 'క్షణం', 'కల్కి' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చోటు సంపాదించింది. అయితే ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో ఆమె బాలీవుడ్‌పై దృష్టి పెట్టింది. తన అందం, గ్లామర్‌తో పాటు రిస్క్ ఉన్న పాత్రలను ఎంచుకోవడంలో అదా ఎప్పుడూ ముందుంటుంది. అదే ధైర్యం ఆమె కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. 2023లో విడుదలైన 'ది కేరళ స్టోరీ' అదా శర్మ జీవితానికి నిజమైన టర్నింగ్ పాయింట్ అయింది. ఈ లేడీ ఓరియెంటెడ్ సినిమా దేశవ్యాప్తంగా భారీ చర్చకు దారితీసింది. రాజకీయ వివాదాల మధ్య విడుదలైన ఈ చిత్రం రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ మూవీతో అదా ఒక్కసారిగా నేషనల్ లెవెల్‌లో పాపులర్ అయింది.ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అదా మాట్లాడుతూ.. "ది కేరళ స్టోరీ విడుదలైనప్పుడు సగం దేశం నన్ను చంపాలని అనుకుంది. కానీ మిగతా సగం దేశం నన్ను ప్రేమించి రక్షించింది. 1920 నుంచే నేను రిస్క్ ఉన్న రోల్స్ ఎంచుకుంటున్నాను. ఆ రిస్క్ వల్లే నేడు నాకు గుర్తింపు వచ్చింది. పాత్రలో భావోద్వేగం లేకపోతే నచ్చదు. యాక్షన్ సీన్లు ఉండాలి అని వెల్లడించింది. ఇక ప్రస్తుతం అదా శర్మ, దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ నివసించిన అదే ఫ్లాట్‌లో ఉంటోంది. ఆ ఇంట్లో సుశాంత్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ ఫ్లాట్‌ను చాలా మంది అద్దెకు తీసుకోవడానికి భయపడ్డా, అదా మాత్రం ధైర్యంగా అక్కడే ఉంటోంది.ఇటీవల ఆమె 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' సినిమాలో శక్తివంతమైన పాత్రలో కనిపించింది. అదనంగా మరో యాక్షన్ థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. సోషల్ మీడియాలో కూడా అదా యాక్టివ్‌గా ఉంటూ, తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులు, ఫిట్‌నెస్ వీడియోలు, డాన్స్ క్లిప్స్, గ్లామరస్ ఫోటోషూట్లతో తరచూ ట్రెండింగ్‌లో నిలుస్తోంది. సవాలు ఉన్న పాత్రలతోనే అదా శర్మ తనదైన ముద్ర వేసుకుంటూ బాలీవుడ్‌లో సత్తా చాటుతోంది.



# గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్..
## మహేశ్ బాబు స్పెషల్ వీడియో


మరికొన్ని గంటల్లో మహేశ్‌రాజమౌళి సినిమాకు సంబంధించిన గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్ భారీ లెవల్లో జరగబోతుంది. శనివారం(నవంబరు 15) సాయంత్రం హైదరాబాద్ శివారులో ఈ వేడుక జరగనుంది. గత కొన్నిరోజుల్లో పలు ప్రమాదాలు జరిగిన దృష్ట్యా.. కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించనున్నారు. ఈ క్రమంలోనే డైరెక్టర్ రాజమౌళి ఇప్పటికే వీడియో రిలీజ్ చేసి తగు జాగ్రత్తలు చెప్పారు. ఇప్పుడు హీరో మహేశ్ బాబు వంతు వచ్చింది. పాస్‌పోర్ట్ (ఈవెంట్ పాస్) ఉంటేనే లోపలికి అనుమతి ఉంటుందని, లేదంటే మాత్రం వచ్చేయకండి అని సుతిమెత్తగా చెప్పారు. ఇంకా చాలా ఈవెంట్స్ ఉండనే ఉంటాయని అభిమానులు కంగారుపడొద్దని జాగ్రత్తలు చెప్పారు. 'ఈవెంట్ రోజున ఆర్‌ఎఫ్‌సీ మెయిన్ గేట్ మూసేసి ఉంటుంది. మీతో పాటు ఉన్న పాస్ స్కాన్ చేస్తే మీరు ఏ గేటు నుంచి రావాలో చూపిస్తుంది. ప్రతి ఒక్కరూ రూల్స్ పాటించండి. పోలీసులకు, సెక్యూరిటీ వాళ్లకు సహకరించండి. పోలీసులు మనకు చెప్పింది ఏంటంటే.. అందరూ ఎంత తక్కువ ట్రాన్స్‌పోర్టేషన్‌తో వస్తే అందరికీ అంత ఈజీగా ఉంటుంది. పాస్‌పోర్ట్ లేకుండా కంగారుపడి వచ్చేయకండి. మనకు ఇంకా చాలా ఈవెంట్స్ ఉంటూనే ఉంటాయి. రేపు సాయంత్రం కలుద్దాం' అని మహేశ్ బాబు చెప్పారు. SSMB29 వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా తీస్తున్నారు. ఇప్పటికే కుంభ పాత్రలో పృథ్వీరాజ్, మందాకిని పాత్రలో ప్రియాంక చోప్రా నటిస్తున్నట్లు ప్రకటించారు. ఆయా పాత్రల ఫస్ట్ లుక్స్ కూడా రిలీజ్ చేశారు. గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో మహేశ్ లుక్ రిలీజ్ చేయడంతో పాటు అనౌన్స్‌మెంట్ వీడియోని కూడా భారీ స్క్రీన్ పై ప్లే చేయనున్నారు. ఈవెంట్ వెళ్లలేకపోతే హాట్‌స్టార్ ఓటీటీలో దీన్ని లైవ్‌గా చూడొచ్చు.



# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నటి అంజలి

కలియుగ దైవం తిరుమల శ్రీవారిని నటి అంజలి, నటుడు శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో వీరిద్దరూ కలిసి స్వామివారి దివ్య దర్శనంలో పాల్గొన్నారు. దర్శనం పూర్తయిన తర్వాత రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనాలు అందించి స్వామివారి పవిత్ర తీర్థం ప్రసాదాలు సమర్పించారు. 'గీతాంజలి', 'గీతాంజలి మళ్లీ వచ్చింది' వంటి సూపర్‌హిట్ చిత్రాలతో నటి అంజలి, నటుడు శ్రీనివాస్‌రెడ్డి ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకున్న విషయం అందరికీ తెలిసిందే.

# ఆర్థిక భద్రత తప్పేంటి?



బుల్లితెర నటి వాబిజ్ దొరబ్జీ ఒంటరిగానే కాలం వెళ్లదీస్తోంది. గతంలో ఆమెకు నటుడు వివియన్ డిసేనతో పెళ్లయింది. 2013లో వీరి వివాహం జర్గగా దాదాపు ఎనిమిదేళ్లపాటు కలిసున్నారు. 2021 డిసెంబర్‌లో విడాకులు తీసుకున్నారు. కానీ, ఈ విడాకుల తర్వాత నటిపై చాలా ట్రోలింగ్ జరిగింది. తను భారీగా భరణం డిమాండ్ చేసిందని, ఆ డబ్బు కోసమే వివియన్‌ను వలలో వేసుకుందని విమర్శించారు. ఇప్పటికీ అలాంటి కామెంట్స్ చేస్తున్నవారికి గట్టి కౌంటర్ ఇచ్చింది వాబిజ్.

**అందులో తప్పేముంది?**

తాజాగా ఓ ఇంటర్వ్యూలో వాబిజ్ దొరబ్జీ మాట్లాడుతూ.. పెళ్లి చేసుకునే ప్రతి మహిళ తనకు భర్త దగ్గర ఆర్థిక భద్రత ఉందా? లేదా? అని చూసుకుంటుంది. అంతమాత్రానికే తను గోల్డ్ డిగ్గర్ (డబ్బు కోసమే పురుషలతో సంబంధం పెట్టుకోవడం) ఎలా అవుతుంది? నిజానికి నేటికాలం పురుషులు చాలా అదృష్టవంతులు. ఈరోజుల్లో మహిళలు బాగా సంపాదిస్తున్నారు, మీతో సమానంగా పని చేస్తున్నారు. అందులో ఎటువంటి తప్పు లేదా చెడు కనిపించడం లేదు.

**వాళ్లు చాలా డేంజర్**

జీవిత భాగస్వామి దగ్గర స్థిరత్వాన్ని, ఆర్థిక భద్రతను కోరుకోవడం తప్పేం కాదు. దానికి గోల్డ్ డిగ్గర్ అని ముద్ర వేస్తున్నారంటే వారికి ఆ పదం అర్థమే తెలిసుండదు. ఈరోజుల్లో చాలామంది మగవాళ్లు మనగురించి అంతా తెలుసుకుని మనతో చక్కగా నవ్వుతూ మాట్లాడుతుంటారు. వారికి డబ్బు అవసరమైనప్పుడల్లా.. కాస్త మనీ ఇస్తావా? అని అడుగుతుంటారు. అలాంటి వాళ్లు చాలా డేంజర్. కొందరు అలా నా దగ్గర డబ్బు కొట్టేయాలని చూశారు.

**అన్నింటిపైనా కన్నేశాడు**

ఒక వ్యక్తి అయితే నాకు పెద్ద టోపీ పెట్టాలని చూశాడు. ఎమోషనల్ డ్రామాలాడి ఒకటీరెండుసార్లు నా దగ్గర డబ్బు తీసుకున్నాడు. తర్వాత ఆలోచిస్తే అతడు నా దగ్గరున్న డబ్బు, ఇల్లు.. ఇలా అన్నింటిమీదా కన్నేశాడని అర్థమైంది. ఇలాంటివాళ్లే అసలైన గోల్డ్ డిగ్గర్స్ అని చెప్పుకొచ్చింది. వాబిజ్ దొరబ్జీ.. ప్యార్‌కీ యే ఏక్ కహానీ, సావిత్రి, సరస్వతిచంద్ర, బాహు మహారీ రజనీకాంత్, దీవానియత్ వంటి పలు సీరియల్స్ చేసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

